# జ్యోతి

"అమ్మా! అమ్మా! పిన్ని దగ్గరనుంచి వుత్తరం వచ్చిందమ్మా!" జ్యోతి తల్లిదగ్గరకు పరుగెత్తుకొస్తూ అంది.

"ఏమని వ్రాసింది? చదువు" అంది శాంతమ్మ. ఆవిడ కీమధ్య పక్షవాతం వచ్చింది. ఇప్పట్లో యేం లాభంలేదనీ, మందులు శ్రద్ధగా తీసుకుంటూఉంటే యే ఆర్నెల్లకో సుగుణం కన్పించవచ్చనీ డాక్టర్లు చెప్పారు. ఇంట్లో వున్నదంతా కుదువపెట్టి అప్పో సొప్పో చేసి మందులు తింటూనేవుంది. ఈ ఆర్నెల్లలోనూ కాలు కొద్దిగా బహు ప్రయాసమీద కాస్త కదపగలగటానికి, ఆవిదంత ఆవిడ లేచికూర్చోటానికి సులువైంది. డాక్టర్లు యింకా మందులు తినా లంటారు. మందులమాట అటుంచి ముందు యింట్లో తింటానికి తిండిగూడా లేనిపరిస్థితివచ్చింది. పల్లెటూరు గాబట్టి, ఆవిడ చేస్తున్నది పంతులమ్మ వుద్యోగం కాబట్టి అంతా తలోవిధంగా కూరా నారా, పెరుగూ పాలూ యిలాటివి సాయంచేస్తున్నారు. శాంతమ్మకి తన జబ్బు నయం అవడం అటుంచి ముందుముందు యింట్లో యెలా గడుస్తుందా అన్నది దిగులు తినెయ్యసాగింది. మనిషి చిక్కిపోయి శల్యంలా తయారైంది.

జ్యోతి కవరు చించి వుత్తరం చదవసాగింది.

శాంతికి,

నువ్వు జ్యోతిచేత వ్రాయిస్తున్న వుత్తరాలు అందుతూనే వున్నాయి. నా కిక్కడ వూపిరి సలపనిపనులవల్ల వెంటనే జవాబు వ్రాయలేకపోయాను. మీకు అక్కడ గడవడం కష్టంగా వుంటే జ్యోతిని తీసుకుని యిక్కడకు వచ్చెయ్యి. భగవంతుడి దయవల్ల మా పరిస్థితులు బాగానే వున్నాయి. జ్యోతికి సంబంధం చూడచ్చు. నీకు వైద్య సౌకర్యంగూడా జరుగుతుంది.

నీ కిలా అన్నివిధాలా అన్యాయం జరుగుతున్నందుకు చాలా విచారిస్తున్నాను. యే సంగతీ వెంటనే జవాబు వ్రాయించు.

ఇట్లు,
విశాల.

వుత్తరం చదవటం పూర్తిచేసిన జ్యోతి మడిచి కవరులో పెట్టేస్తూ "పిన్ని యెంత మంచిదమ్మా!" అంది. శాంతమ్మ మొహంలో సంతోషమే కన్పించలేదు.

"మనం బైలుదేరి వెళ్దాం యేమాంతుం దమ్మా" అంది జ్యోతి.

"మనమా!" శాంతమ్మ వెనక్కు జారగిలబడింది.

"నా కెందుకో పిన్నిదగ్గరకు వెళ్తే మన సమస్యలు తీర్తాయి అన్పిస్తోంది." నమ్మకంగా అంది జ్యోతి.

"యెలా?" శూన్యంలోకి చూస్తూ అడిగింది శాంతమ్మ. జ్యోతి అమాయకురాలు. ప్రపంచానుభవం లేనిది. ఈ ప్రపంచంలో సంతోషం పంచుకునేందుకే చుట్టాలుగాని దుఃఖానికి కారని తెలియదు.

"అవును. పిన్నిదగ్గర జాగ్రత్తగా వుండి ఆవిడకి ఆప్యాయంగా మసులుకుంటే నీకు మంచివైద్యం దొరుకుతుంది. మనం వూరికే వున్నట్టు గాకుండా ఆవిడకి నే నోవిధంగా సాయపడ్తూంటాను. హైద్రాబాద్ అంటే మంచి మంచి డాక్టర్లు వుండితీరుతారు. నీకు నయం అయిపోతే మనం మళ్ళీ మనవూరు వచ్చెయ్యొచ్చు. నువ్వు నీ టీచర్ జాబులో జాయినయిపోవచ్చు. నిన్నిలా మంచంలో చూస్తూంటే నా గుండె లెవరో చేత్తో బలంగా మెలితిప్పిన ట్టనిపిస్తోందమ్మా! నా మాట విను." జ్యోతి తల్లి దగ్గరగా వచ్చి మంచం మీద కూర్చుని ఆవిడ చేతిని తన చేతిలోకి తీసుకుంటూ "పిన్నికీనీకూ కొద్దిరోజులనుంచీ రాకపోకలు లేనిమాట నిజమే. తాతయ్యతో మొదలైన మీ యిద్దరి తగాదా ఆయనతోనే యెందుకు పోనియ్యకూడదు? ఆవి దెలాగూ రమ్మని రాస్తూనేవుందయ్యె. నువ్వే పాతవన్నీ గుర్తు చేసుకుంటూ మొండిపట్టు పట్టుక్కూర్చున్నావు'' అంది నిష్ఠూరంగా.

"నీకు తెలియదే జ్యోతీ, నీకు తెలియదు. ఇప్పుడు, పదహారు సంవత్సరాల తర్వాత యీ పరిస్థితుల్లో అన్నివిధాల చితికిపోయి దానింటికి వెళ్లేకంటే చావడంమేలు, అదెంత గర్విష్టిదో నీకు తెలియదు.''

"గర్విష్టిదైతే రమ్మనమని యెందుకు రాస్తుందమ్మా! నీ అభిమానం నేనుమటుకు అర్థం చేసుకోలేనా! కానీ నామాట వినమ్మా! నీకు నయం కావటం మనకి ముఖ్యం. అక్కడికెళ్తే, మంచి డాక్టర్‌కి చూపిస్తే, నీకు తప్పకుండా నయంఅవుతుందని నాకు నమ్మకంగా వుంది.'' దృఢంగా అంది జ్యోతి; కళ్ళముందు తల్లికి నయంకావటం, తాము మళ్ళా తిరిగి వచ్చెయ్యటం స్పష్టంగా కన్పిస్తోంది.

చివరి కెలాగో బలవంతం చేసి దాదాపు తల్లి యిష్టానికి వ్యతిరేకంగానే జ్యోతి పింతల్లిపేరిట రావటానికి సిద్ధపడ్తున్నట్టు, వుత్తరం శాంతమ్మే రాయించినట్టు, తనే వ్రాసింది. కొద్ది రోజులు పోయింతర్వాత విశాల అక్కగారి వుత్తరానికి తను చాలా సంతోషిస్తున్నట్టు వుత్తరంరాసి కొద్దిడబ్బు మనియార్డర్ చేసి అక్కడేమైనా అప్పులుంటే తీర్చుకుని ఫలానారోజుకి ఫలానా టైమ్‌కి బెజవాడ తెలిసినవాళ్ళ కారు వస్తుందనీ, అక్కడికెలాగైనా చేరుకుంటేఅందులో వచ్చెయ్యవచ్చనీ తను చెప్పి పంపిస్తున్నాననీ వ్రాసింది.

జ్యోతి చాలా సంతోషించింది. 'పిన్ని నిజంగా యెంతమంచిది!' అనుకుంది. చిన్నప్పు డెలావున్నా పెరిగి పెద్దయినకొద్దీ, అనుభవాలు పొందుతున్నకొద్దీ మనుష్యులు

యద్దనపూడి సులోచనారాణి

తప్పకుండా మారుతారు. తల్లిగూడా అలాగే మారివుంటుంది. లేకపోతే యింత శ్రద్ధగా యెందుకు ఉత్తరం వ్రాస్తుంది! అమ్మ బొత్తిగా యిదెందుకు అర్థం చేసుకోదు. కారణం యేమిటో జ్యోతికి అంతుబట్టలేదు.

*  *  *

వయస్సుకి మించిన వార్ధక్యంతో మనిషి లోనూ, బట్టల్లోనూ జీర్ణించిపోయి స్పష్టంగా కన్పిస్తున్న దారిద్ర్యంతో వాకిట్లో అడుగు పెట్టిన అక్కగారిని చూసి విశాల మొదట గుర్తు పట్టలేకపోయింది. జ్యోతీవాళ్ళు వచ్చేసరికి ఆవిడ తయారై బైట యెక్కడికో వెళ్ళటానికి సిద్ధ మౌతోంది.

"అయ్యో! యెంత మారిపోయినావే! అసలు గుర్తుపట్టనేలేదు నేను" అంది.

తండ్రి నెదిరించి, బామ్మని దుఃఖపెట్టి వారాలబ్బాయి ఛాన్కారాన్ని చేసుకుని చాలాకాలం



యింట్లో అశాంతిని రేకెత్తించి పోయిన అక్కగారంటే విశాల కీనాడూ సానుభూతి లేదు. చేసుకున్నవాళ్ళకు చేసుకున్నంత మహాదేవ! ఆ ధీమా, ఆ పొగరు, ఆ నిర్లక్ష్యం యీ రోజు యేదీ! ఇలాటి పరిస్థితుల్లో, ఆ అతి దీనంగావున్న

మొహం చూస్తున్నాకూడా జాలి కలగలేదు. తల్లి ప్రక్కనే ఎఱ్ఱటి ముతకవాయిలు చీరతో వెలిసిపోయిన పూల జాకెట్‌తో నిలబడిన జ్యోతిని చూస్తూ 'రామ్మా! ప్రయాణం కులాసాగా జరిగిందా?' అంది. విశాలని చూస్తూనే జ్యోతి ఆలోచనలన్నీ తలక్రిందులైపోయినాయి. తను వుత్తరాలు చదివి వూహించుకున్నట్టు ఆదరంగా, ఆప్యాయతగా, నిండుగా, హుందాగా లేదీవిడ. కంటికి కన్పిస్తున్న వయసుని దాచుకోవటానికి ఆవిడ చేస్తున్న ప్రయత్నం చీర కట్టుకోవడంలోనూ, చుట్ట పెట్టుకోవడంలోనూ, జుట్టుముడి వేసుకోవడంలోనూ, నగలు పెట్టుకోవడంలోనూ స్పష్టంగా కన్పిస్తోంది. మాటల్లో డాబూ, దర్పం ఆవిడ తెచ్చిపెట్టుకున్నదనిగూడా తెలుస్తోంది. జ్యోతి పిన్తల్లిని రెప్ప వాల్చకుండా చూస్తూండగానే ఇంతలో 'అమ్మా! నా శాటిన్‌స్కర్ట్ యెక్కడ పెట్టావు. అద్దంబీరువాలో లేదు?' అంటూ బంతిలా గెంతుతూ వచ్చిన గీత అనుకోకుండా కన్పించిన వాళ్ళని చూసి ఆగిపోతూ 'యెవరు?' అంది.

'నేను చెప్పలా! మా అక్క వస్తుందని.' విశాలమ్మ ముభావంగా అంది.

'ఓ! జ్యోతి అంటే నువ్వే గదూ! గీత దగ్గరగా వచ్చి జ్యోతి చేతిని తన చేతిలోకి తీసుకుంది. పచ్చటి బట్టల్లో, రెండు జెడల్తో పొట్టిగా, లావుగా, పట్నవాసపు నాజూకుతనంతో మెరిసిపోతున్న గీతని చూస్తూంటే జ్యోతి కెందుకో తనకి తనే చాలా తక్కువగా అన్పించింది.

'ఊఁ'! వెళ్లు త్వరగా. మళ్ళీ ట్రెయిన్‌కి టయి మౌతుంది, అంది విశాల కూతుర్ని చూసి కనుబొమలు ముడుస్తూ. గీత అంత చనువుగా జ్యోతి దగ్గరకు వెళ్ళటం ఆవిడకి నచ్చ లేదు. గీత రూపునీ బట్టల్నీ చూసి జ్యోతి యీర్ష్య పడొచ్చు. ఆ యీర్ష్య గీతకి దిష్టికొట్టొచ్చు. సాధ్యమైనంతవరకు జ్యోతినీ గీతనీ దూరదూరంగానే వుంచాలని అప్పుడే నిశ్చయం చేసుకుంది.

'ట్రయి నేమిటి?' అంది శాంతమ్మ.

"మాకాబోయే అల్లుడు. అతను ఫారెన్ రిటర్న్డ్ డాక్టర్‌లే; యేదో పనిమీద బెంగుళూరు వెడ్తున్నాడు. ఊఁ! ఇంకా యిక్కడే నిలబడ్డే! వెళ్ళి త్వరగా తయారు కమ్మని నీక్కాదు చెప్పేది" అంది కూతుర్ని మరోసారి హెచ్చరిస్తూ. గీత ఓసారి జ్యోతి వైపు స్నేహపూరితంగా చూసి అక్కడినుంచి వెళ్ళిపోయింది.

విశాల, శాంతమ్మా జ్యోతీ ఉండటానికి ఇంటికి యెడంగా కుడివైపు మూలగా వున్న ఔట్‌హవుస్ చూపించింది. పట్నవాసాల్లో సంపన్న కుటుంబాలు యిళ్లు కట్టేటప్పుడు సాధారణంగా పనివాళ్ళకోసమని యీ యిళ్ళు కడ్తారు. అది యిల్లు గూడా అన్పించుకోదు. ఓ చిన్న గదీ, దాన్ని ఆనుకుని కాస్త ఓ పెద్ద గదీ — యిద్దరికి విశాలంగానే వుంటుంది. అందులోనే ఓ పాత నవారుమంచం వుంది.

"ఇంట్లోకంటె యిక్కడ నీకు ప్రశాంతంగా వుంటుందే శాంతా" అంది లైటువేసి యిల్లు చూపిస్తూ. అక్కచెల్లెళ్ళ మధ్య పెద్ద వయసు తేడా లేదు. అందుకే విశాల పేరు పెట్టి పిలుస్తుంది. 'బాగుంది, చాలాబాగుంది' శాంతమ్మ తృప్తిగా అంది. 'మా కాబోయే అల్లుడు చాలా మంచిడాక్టర్. అత నీపూట వూరు వెడ్తున్నాడు. వారం రోజుల్లో తిరిగి వచ్చేస్తాడు. రాగానే చూపిస్తాను. అతనైతే ఫీజుకీ దానికీ మనకి కానీ ఖర్చుండదు– మందులు కొనుక్కోవటం తప్ప.' మంచం ప్రక్కనేవున్న చిన్న స్టూలుమీద కుర్చుంటూ అంది 'నాకు కూడా యింట్లో చేతిక్రింద తోడెవరూ లేరు. మన జ్యోతిని అట్టేపెట్టుకుంటాను. మీ దగ్గరమటకు మహా డబ్బుందా యేమన్నానా? మాటిమాటికీ నన్నడగాలన్నా కష్టమే అన్పిస్తుంది. అందుకని నెలకింత అని వాడుకోటానికి కొంత ఇస్తుంటాను. మీ మరిదికి కూడా చెప్తాను. ఆయన కాలేజీలో లెక్చరర్‌గా! బోలెడంత వుంది పిల్లలు నానారకాలవాళ్ళు తెలుస్తారు. మీ స్థితికి తగ్గవాడు దొరక్కపోడనుకుంటా.'

విశాల మాట్లాడ్తుండగానే సిల్కుచీర రెపరెప లాడించుకుంటూ గీత పరిగెత్తుకొస్తూ 'అమ్మా? సారథి వచ్చాడమ్మా' అంది లేత ఆకుపచ్చరంగు నైలాన్‌చీరలో దానిమీద చెమ్కీపూలతో, మెడచుట్టూ అందంగావున్న డిజైనులో అద్దాలు కుట్టిన చోళీతో, మెరిసిపోతున్న గీత. యింతక్రితం జ్యోతి చూసినప్పటికంటె అందంగా, అద్భుతంగా వుంది.

'వచ్చాడా! పద వస్తున్నాను. మళ్ళీ 2 గంటలలో వస్తాను' అని చెప్పి విశాలగూడా త్వరత్వరగా వెల్లిపోయింది. గీత తొందరలో యీసారి జ్యోతివైపుగూడా చూడలేదు. జ్యోతినీ, గీతనీ ప్రక్కప్రక్క నిలువుకుని చూస్తుంటే జీవితంలో మొట్టమొదటిసారిగా తమ తండ్రి నెదిరించి భాస్కరాన్ని చేసుకోవటం పొరపాటేమో అన్పించింది శాంతమ్మకి. తను కాదన్నవాడిని పెళ్లాడింది అనే కసితో తండ్రి వున్న ఆస్తంతా విశాలకి రాసియిచ్చేశాడు. లేకపోతే ప్రసాదరావుకేం వుంది? ఒక్క ఎమ్. ఏ. డిగ్రీ తప్ప; వ్యక్తిత్వం లేదు. తెలివితేటలు లేవు. విశాల యెంత అంటె అంత. విశాల యీ యింటికి మహారాణి అనీ, దానిమాటకు తిరుగుండదీ యింట్లో అనీ శాంతమ్మ మొదటి చూపుతోనే గ్రహించింది.


* * *

హైద్రాబాద్ వచ్చిన కొద్దిరోజులకే జ్యోతికి తమ పిన్నిలో వూహించినవీ ఆసించినవీ అన్నీ యెండమావులని తెలిసిపోయింది. అక్కగారిని రమ్మనమని వ్రాయడంలో అర్థం విశాలకి శాంతమ్మ మీద జాలిపుట్టి గాదు; జ్యోతి ఇంట్లో చేతిక్రింద తోడుగా వుంటుందని మాత్రమే! పట్నవాసం – మునుపటి రోజులు గావు; యింట్లో వుండటానికి గాని, వంట చెయ్యటానికి గాని సరైన మనుష్యులు దొరకరు. ఒకవేళ దొరికినా బోలెడంత అడుగుతారు. ఇచ్చినా వాళ్ళబుద్ధి సరిగా వుండదు. వస్తువు

లన్నీ దుబారా చెయ్యడం, కాస్త కనుమరుగై తేచాలు యింటికి చేరవెయ్యడం చేస్తారు. వంటమనిషిది పెద్ద సమస్య అయి కూర్చుంది విశాలకి. తనకి చూడబోతే క్షణం తీరుబడి వుండదు. ఇవన్నీ చూసుకుంటూ కూర్చోవాలంటే కుదరదు. ఆ సమయంలోనే శాంతమ్మ దగ్గరనుంచి వుత్తరం వచ్చింది. జ్యోతి యీపాటికి పద్దెనిమిది సంవత్సరాలు దాటిందయి వుంటుంది. వుంటున్నది పల్లెటూరు గాబట్టీ, చదువూ సంధ్యా లేదుగాబట్టీ తప్పకుండా వంటా వార్పూ వచ్చివుంటుంది. పెళ్ళి సంబంధాలు చూస్తాం అనే నెపంతో పిలిపిస్తే ముందు కొంతకాలం యింట్లో వంట మనిషి విషయం నిశ్చింతగా వుండవచ్చు. ఇవన్నీ ఆలోచించుకునే శాంతమ్మకి వైద్య సహాయంగూడా జరుగుతుందని ఆశ బెట్టి వుత్తరం వ్రాసింది. ఆవిడ ఆలోచనల్లెప్పుడూ వృధాపోవు. అంచనా మించవుగూడా. సరిగ్గా తను అనుకున్నట్టే వాళ్ళు వచ్చారు. తన బెడద తీరిపోయింది.

జ్యోతికి వచ్చిన రెండోరోజునుంచే వంటయిల్లు అప్పజెప్పింది. వారంరోజులు తిరిగేసరికి యింట్లోకి కావల్సిన వస్తువులన్నీ చూడటం, వాటికోసం వాడిన డబ్బు నయాపైసా బీరుపోకుండా పెద్ద నోట్ బుక్‌లో లెక్క వ్రాయడం జ్యోతిమీద పడింది. యెప్పుడో రాత్రి పదిగంటలకి మంచంమీద పడుకుని నిద్ర పోబోయేముందు విశాల నోట్ బుక్‌ని పరీక్ష చేస్తుంది. డబ్బు విషయంలో ఆవిడ జ్ఞాపకశక్తి మెచ్చుకోదగింది. తను జ్యోతి కిచ్చిన ప్రతిపైసా అందులో వుందో లేదో ఆవిడ కనిపెట్టగలదు.

వంటవిషయంలోగూడా వున్నది ముగ్గురైనా, కూతురికి నచ్చింది తల్లికి నచ్చదు; తల్లికి నచ్చింది తండ్రికి సయించదు; అందరికీ యేపూట కాపూట విడివిడిగా చేయాల్సిందే. పైనుంచి యింటికి తరుచుగా విశాల కోసం బోలెడంతమంది స్నేహితులు




"ఇక మోటారు రేసు చాలించండి!"

వస్తారు. వాళ్ళకి కాఫీలు, టిపిన్లు. ఏయే టిఫిన్లు యెలా చెయ్యాలో చూచాయగా జ్యోతికి ముందుగానే చెప్పేసింది. ఏ విషయం అయినా ఒక్కసారి వినటంతోనే గ్రహించగలిగిన జ్యోతి వంటలో బాగా నైపుణ్యం సంపాయించింది అనే పేరు తెచ్చుకుంది. జ్యోతికి యివన్నీ చెయ్యడం పెద్దగా బాధ అన్పించటంలేదు. అవుసరంలో ఆదుకుని ఆశ్రయం యిచ్చినవాళ్ళకి ఆ మాత్రం సహాయం పడకపోతే యెలా అనుకునేది. యెలాగో అలా తల్లికి నయమైతే అదే పదివేలు. వచ్చి పదిహేను రోజులు దాటింది. బెంగుళూరు వెళ్ళిన సారధి అక్కడే మరో కేసు తగలడంతో వుండిపోయాడు. విశాల మరో డాక్టర్‌కి చూపించే వుద్దేశ్యం కన్పరచలేదు.

ఆరోజు మధ్యాహ్నం తల్లిదగ్గర కూర్చుని పుస్తకం చదివి విన్పిస్తున్న జ్యోతి దగ్గర కొచ్చి విశాల ఓ గంటలో ఆరుగురు స్నేహితులు వస్తున్నారనీ కాఫీ. టిఫిన్ చేసి వుంచమనీ చెప్పి వెళ్ళిపోయింది. 'ఈరోజు గూడా యీ కథ పూర్తిగాలేదు. రాత్రికి తప్పకుండా పూర్తి చేస్తానమ్మా" అంది జ్యోతి హుషారు తెచ్చిపెట్టుకుంటూ.

"ఇప్పుడే గదా! భోజనం చేసివచ్చావు. ఇప్పుడే మళ్ళీ వెళ్ళాలా?'' అంది తల్లి.

ఆవిడ మొహంలో అప్రసన్నత స్పష్టంగా కన్పిస్తోంది. ఆ పల్లెటూల్లో ఉన్నప్పుదే నయం. ఉన్న పనేదో చూసుకుని జ్యోతి వచ్చి యెప్పుడూ తల్లిదగ్గరే కూర్చునేది, ఇక్కడికి వచ్చింతర్వాత కంటికి కన్పించటమే కష్టం అవుతోంది. భగవాన్! తనసలు యిక్కడికి యెందు కొచ్చింది! శాంతమ్మ మనసులో కుమిలిపోసాగింది. పిచ్చి పిల్ల! తనకీ పాపిష్టి రోగం రాకముందు చిన్న మెత్తుపని చేసి యెరగదు. ఇప్పు డింతమందికి యిన్ని రకాలుగా చేయటంకోసం వంటయింట్లో పడి మగ్గిపోతోంది. శాంతమ్మ మనసు కూతురిపట్ల ద్రవించసాగింది.

"యెంత సేపమ్మా! ఓ అరగంటలో అయిపోతుంది. యిప్పుడేవచ్చేస్తాను" అంటూ జ్యోతి వెళ్ళిపోయింది.

టిఫెన్, కాఫీ పూర్తయిపోయింది కాని విశాల స్నేహితులు యింకా రాలేదు. టిఫిన్ వేడిగా వుండటంకోసం కొద్దిగా సెగ వుంచి కుంపటిమీద వుంచేసి కాఫీ ఫ్లాస్క్‌లో పోసేసింది. అనుకున్న వేళకి అరగంట ఆలస్యంగా వాళ్ళు వచ్చారు. మేడమీద కూర్చుని వాళ్ళతో మాట్లాడుతున్న విశాల మరో అరగంట అయింతర్వాత క్రిందికి దిగి వచ్చి కాఫీ టిఫెన్ పైకి తెమ్మని చెప్పి వెళ్ళిపోయింది.

జ్యోతి టిఫెన్ ప్లేట్స్ తీసుకెళ్ళి యిచ్చి మళ్ళీ క్రిందకు వచ్చి యింకో ట్రేలో కాఫీ కప్పులు పైకి తీసుకెళ్ళింది. వచ్చిన వాళ్ళంతా తలోరకంగా వున్నారు. అందరిలోనూ అలంకరణ ఆడంబరంగా కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.

'యెవరీ అమ్మాయి' ఒకావిడ అడిగింది.

'వంట మనిషి' గర్వంగా అంది విశాల. జ్యోతి తృళ్లిపడటం యెవరూ గమనించలేదు.

'అరె' మీ గీతకీ తనకీ పోలిక లుంటే యింకా చుట్టాలేమో అనుకుంటున్నాను నేను కూడా' యింకో ఆవిడ ఆశ్చర్యంగా అంది.

'లేదు, లేదు. అవునుసుమా! అది నేను గమనించనేలేదు.' అంటూ కాఫీకప్పు తీసుకొంటున్న విశాల జ్యోతికేసి చిరాకుగా చూస్తూ 'నీ కెన్నిసార్లు చెప్పాలి! బుద్ధిలేదూ! కాఫీ చూడు యెంత చల్లారిపోయిందో' అంది.

స్నేహితుల ముందు తన అధికారం చూపించుకోవటం ఆవిడకి మహాయిష్టం.

ఫ్లాస్క్ వేడి సరీగ్గా నిలవ దని జ్యోతికి తెలుసు. కాని మరీ అంత చప్పగా చల్లారిపోలేదు.

"ఒక్క నిమిషం ఆగండి - వేడిగా చేసి తీసుకొస్తుంది." విశాల స్నేహితుల్ని వారించింది. ఆవిడ యేదయినా భరిస్తుంది గాని స్నేహితుల మధ్య సర్దుకుపోవటానికి ఒప్పుకోదు.

"పోన్లెండి; మళ్ళీ శ్రమ పాపం! ఇంకో ఆవిడ జ్యోతివైపు చూస్తూ అంది. శ్రమేవిటండీ! మనకి వూరికే చేస్తారా! డబ్బు పారేస్తున్నాం, పని ఆడుగుతున్నాం; అంతేగా."

కాఫీ కప్పులతో ట్రే పట్టుకుని గుమ్మం దాటి వచ్చేస్తున్న జ్యోతి చెవులకి యీ మాట విన్పించి ముఖం అంతా యెర్రబడేలా చేశాయి. యింత ధైర్యంగా, యింత సూటిగా యెదటి మనుష్యుల్ని అవమానించగలరు అనుకుంటే ఆశ్చర్యమే కాకుండా అసహ్యం వేస్తోంది. తల్లి మొదటే తనని వారించింది. కాని తనే వినలేదు. అనుభవ పూర్వకంగా పెద్దవాళ్లు చెప్పిన మాట వినకపోతే యిలా అనుభవించాల్సిందే! ట్రే తీసుకుని గబగబా దిగివచ్చేస్తున్న జ్యోతి క్రిందనుంచి మరోమనిషి పరధ్యాసగా మెట్లెక్కిరావటం గమనించలేదు.

ఇద్దరూ ఒకళ్ళని ఒకళ్లు గమనించుకుని ప్రక్కకు తప్పుకునే ప్రయత్నంలో యిద్దరూ ఒకే ప్రక్కకు వచ్చేశారు. అనుకోకుండా యెదురొచ్చిన మనిషిమీద పడకుండా తనని తను నిలుపుకోవాలనే ప్రయత్నంలో జ్యోతి తూలిపడబోయింది. వెంటనే బలిష్టమైన చేయి వకటి జ్యోతి జబ్బని పట్టుకుని పడిపోకుండా బలంగా ఆపి నిలబెట్టింది.

"అరె!" అవతల వ్యక్తి జ్యోతి చేతిని యింకా అలాగే గుచ్చి పట్టుకుని అన్నాడు. అత నెవరో జ్యోతికి తెలియదు. కాని బాగా నిలువెత్తు మనిషి. అతని కళ్లు జ్యోతిని పరిశీలనగా గుచ్చి చూస్తున్నాయి.

"అయ్యయ్యో!" అతని బట్టల వైపు చూస్తూ ఖంగారు ఐంది. తను పడకుండా ఆగటానికి చేసే ప్రయత్నంలో కాఫీకప్పులు చెదిరి కాఫీ తొణికి అతని బట్టలనిండా పడింది. జ్యోతి చెప్పడంతో అతనుగూడా చూసుకున్నాడు. వెంటనే జ్యోతి చేతిని వదిలేసి 'నెవ్వర్ మైండ్' అంటూ జేబులోంచి జేబురుమాలు తీసి గట్టిగా తుడిచేసుకున్నాడు. కాఫీమరకలు కర్చీఫ్‌తో తుడిస్తే పోవని యిద్దరికీ తెలుసు.

"హల్లో! సారథీ!" అప్పుడే బైట నుంచి వచ్చిన గీత మెట్లమీద సారథిని చూసి పరుగెత్తుకుంటూ వచ్చింది. సారథి వెనక్కు తిరిగాడు.

"అరెరే! యేమిటీ అన్యాయం. నా కిష్టమైన బట్టల్ని యిలా పాడుచేసిన దుర్మార్గులు యెవరు?" సరీగ్గా జ్యోతి వైపు చూడకుండానే అరిచింది గీత.

"దేవతలు" - సారధి నవ్వాడు. గీత గొంతు విని విశాల బైట కొచ్చింది. ఆవిడ మొహం సారథిని చూస్తూనే చాటంత అయింది:

"యెప్పు డొచ్చారు మీరు" అంటూ క్రిందకు దిగివచ్చింది. అన్నీ జ్యోతి చూస్తుండగానే రెప్పపాటులో జరిగిపోతున్నాయి.

జ్యోతి దారి తొలిగి ప్రక్కగా నిలబడి విశాలకి చోటు యిచ్చింది.

"అరెరె! యేమి టా బట్టలు,!" విశాల గూడా ఆశ్చర్యపోయింది.

"కాఫీ పడింది" అన్నాడు సారథి. బట్టలు మరకలతో అసహ్యంగా అయినమాట వాస్తవమే.

"కాఫీనా?" విశాల కోపంతో యెర్రబడిన మొహంతో జ్యోతివైపు తిరిగింది. "యీ మహాతల్లి చేసిన ఘనకార్యమేనా?"

"లేదు, లేదు; నేనే సరిగా చూడలేదు." సారథి సర్దెయ్యబోయాడు.

"బుద్ధిలేదూ! చెట్టంతమనిషి యెదురుగుండా వస్తుంటే కళ్లు కన్పించలా?" విశాల తీవ్రంగా అంది.

మరోసారి జ్యోతి కళ్ళు అతని కళ్ళతో కలిసిపోయి వాటిల్లో యీసారి సిగ్గూ, భయం స్పష్టంగా కన్పిస్తోంది.

మరుక్షణంలో సారథిని తొలగించుకుని అక్కడినుంచి రివ్వున పారిపోయింది.

"యెవ రామ్మాయి?" జ్యోతి వెళ్ళిన వైపే చూస్తూ అడిగాడు.

"మా వంటమనిషి. యెక్కడో బీరకాయ పీచు చుట్టరికం వుందిట. నాకు తెలియదు. తల్లికి పక్షవాతం వచ్చింది. తింటానికి తిండి లేదు. బొత్తిగా దిక్కులేనివాళ్ళు."

"మమ్మీ! సారథిబట్టలు చూడు మమ్మీ. నా కిష్టం అయిన సూటు యిది." గీత గారాబం ఒలకబోస్తూ బాధపడింది.

పోన్లే! పాడైపోయింది మా యింట్లో గాబట్టి మేం అలాటిది కుట్టిస్తాము" అంది విశాల నవ్వుతూ. సారథికూడా నవ్వాడు. ముగ్గురూ పైకి వెళ్ళారు.

ఈ సారి గీత తనే స్వయంగా వంట యింట్లోకి వచ్చి కాఫీ తీసుకెళ్ళింది.

అయితే అతనే నన్నమాట సారథి! వూరునుంచి వచ్చాడుకాబోలు. ఈరోజు అమ్మనిచూపించవచ్చు. జరిగిందంతాక్షణంలో మర్చిపోయి తల్లిదగ్గర కెళ్ళి ఆత్రంగా యీ వార్త చెప్పింది. కాని జ్యోతి ఎంతసేపు

యెదురుచూసినా ఆరోజు సారథి బోట్ హౌస్ లోకి రాలేదు. చాలా పొద్దుపోయింతర్వాత యింటికి వెళ్ళిపోయాడు.


"పిన్నీ! ఆయనకి అమ్మని చూపించ లేదేం!" పడుకోబోయేముందు పింతల్లికి లెక్కలుచూపించే నోట్ బుక్ అందిస్తూ అన్నది జ్యోతి.

"బాగుంది నువ్వు చెప్పింది. అతను వూరునుంచి అడుగు పెట్టూనే చూస్తాడా ఏమిటి? నాకు తెలుసు అవన్నీ! నువ్వేం గుర్తుచెయ్యక్కర్లేదు. నీ సలహాలు అవసరం లేదు. నువ్వుమటుకు కొంచం వళ్ళు దగ్గిరపెట్టుకుని మసిలితే బాగుంటుంది. అట్లా మగవాళ్ళని చూస్తూనే మతి పోగొట్టుకుంటే యెలా?". అడిగింది వదిలేసి యెదురు వుపన్యాసం రావటంతో జ్యోతి మొహం చిన్నబుచ్చుకుని అక్కడనుంచి వచ్చేసింది.

"ఇంకా పడుకోలేదామ్మా జ్యోతీ." తన గదిలోనుంచి యెందుకో బైటకు వచ్చిన ప్రసాదరావుగారు రాత్రి 11 గంటలకి యింకా గ్లాసులతో మెట్లు దిగి వస్తున్న జ్యోతిని చూస్తూ అడిగారు.

"లేదు బాబాయి," అంది జ్యోతి.

"త్వరగా పడుకోవటం మంచిదమ్మా! ఆరోగ్యం పాడయిపోతే యెవరు చేసేదీ యేముండదు," అన్నారాయన తనగదిలోకి వెళ్ళిపోతూ. జ్యోతి కళ్ళలో అప్రయత్నంగా నీళ్ళు తిరిగాయి. ఈ యింట్లో కాస్త ఆప్యాయతగా మాట్లాడేది ఆయన ఒక్కరు.





కాని ఆయనకి జ్యోతికంటే యెక్కువేమీ విలువ లేదు ఆ యింట్లో. ఆయన కాలేజి యేమో, ఆయన పుస్తకా లేమో; అవితప్ప మరో గొడవ పట్ట దాయనకి.

అప్పుడప్పుడు మటుకు. విశాల చెప్పినప్పుడు బట్ట లేసుకుని నీటుగా తయారై పార్టీలకీ – ఫంక్షన్స్‌కీ వెళ్ళివస్తుంటాడు. ఆ వెళ్లిన కాసేపు ఆయనకి ముళ్ళమీద వున్నట్టే వుంటుంది.

జ్యోతి తల్లి గదికి తిరిగి వచ్చేసరికి శాంతమ్మకి నిద్రపట్టింది. యెప్పుడో కాస్త పట్టిన ఆ నిద్రని పాడుచెయ్యడం యిష్టం లేని జ్యోతి చప్పుడు చెయ్యకుండా ప్రక్కనే చాప పరుచుకుని పడుకుంది. జ్యోతికికూడా తను యిలా హైద్రాబాదు రావడం పొరపాటు చేసానేమో అన్పించసాగింది.

* * *

మర్నాడు వచ్చినప్పుడు సారథిని ఔట్ హవుస్‌కి తీసుకొచ్చి శాంతమ్మని చూపించింది. అతను పరీక్ష చేసి యివతలకు వచ్చి జ్యోతి వింటుండగానే యింకా మంచి ఆహారం పడాలి, దిగులు అసలుండకూడదు. ఇలాగే కంటిన్యూ అయితే యింకోసారి త్వరలోనే మరో స్ట్రోక్ వస్తుంది. అప్పుడు ప్రాణం పోవడం అన్నా జరుగుతుంది; లేకపోతే నోటిమాట పడిపోయి యిక ఆజన్మాంతం మంచంలో పడివుండటం అన్నా జరుగుతుందని చెప్పాడు. చెప్తుండగా మధ్య మధ్య ఒకటి రెండుసార్లు రెప్ప వాల్చకుండా వింటున్న జ్యోతివైపు చూశాడు. ఈ అమ్మాయిది వయసు వికసించింది, కాని పసితనం పోలేదు అన్పించింది అతనికి.

విశాల సారథి రాసియిచ్చిన లిస్ట్‌లో తనకి తోచినది మటుకు కొనుక్కొచ్చి యిచ్చింది. జ్యోతి చేసిన పనికి తగ్గట్టు శాంతమ్మ ఖర్చుపెట్టా మనుకుంది. ఆ స్తిని ఒక్క నయాపైసగూడా ఖర్చుపెట్ట దల్చుకోలేదు. అప్పుడప్పుడు జ్యోతిని పిలవటానికి వచ్చినప్పుడు శాంతమ్మ తన అభిమానాన్ని చంపుకుని విశాలని దగ్గరకు పిలిచి తన కిహ బ్రతికేఆశ లేదనీ జ్యోతి కేదైనా సంబంధం చూడమనీ అడగసాగింది.

సారథి వున్నంతవరకూ తనదగ్గర మందులు వుచితంగానే యిస్తున్నాడు. దిన దినం వచ్చి యింజెక్షన్స్ యిచ్చివెళ్తూనే వున్నాడు. సారథి శాంతమ్మని చూడటానికి ఔట్ హవుస్‌కి వచ్చినప్పుడు వెంట తప్పకుండా విశాలగాని, గీతకాని వుండి తీర్తారు.

సారథి వైద్యం కొంచం పని చేస్తున్నట్టే వుంది. శాంతమ్మ కోలుకుంటోంది. ఓరోజు సారథి శాంతమ్మకి యింజెక్షన్ యివ్వటానికి వచ్చాడు. ఆరోజు అర్జెంట్ కేసు రావటంవల్ల అతనికి వుదయం వచ్చేందుకు వీలులేకపోయింది.

సాయంత్రం వచ్చేసరికి విశాల లేదు. క్లబ్‌లో యేదో మీటింగ్ వుందని వెళ్ళిపోయింది. గీత మటుకు యింట్లోనే వుంది.

“గ్లాస్‌తో కొంచం నీళ్ళివ్వండి – జ్వరం వుందేమో చూడాలి” ధర్మామీటర్ తీస్తూ అన్నాడు సారథి. జ్యోతి యింట్లోకి వెళ్ళి గ్లాసుతో నీళ్ళు తెచ్చియిచ్చింది. అప్పటికే శాంతమ్మ నోటిలోంచి థర్మామీటర్ తీసి పరీక్ష చేస్తున్న సారథి ‘జ్వరం వుంది. ఈ పూట భోజనం వద్దు–’ అన్నాడు గ్లాసుకోసం చెయి జాచి శాంతమ్మవైపు చూస్తూ. జ్యోతికూడా గ్లాసు అందిస్తూ అతనివైపు చూసింది.

సారథి గ్లాసు అందుకోనేలేదు. జ్యోతి వదిలేసింది. గ్లాసు కిందపడి చప్పుడు చేస్తూ ముక్కలైంది. శాంతమ్మకోసం అని ఓ గాజు గ్లాసు ఔట్ హవుస్‌లో వేరుగా వుంచింది విశాల. అది కాస్తా పగిలిపోయింది. జ్యోతి నేలమీదకు వంగి ముక్కలు యేరడం ప్రారంభించింది. సారథిగూడా అప్రయత్నంగా వంగి తనూ యేరడం ప్రారంభించాడు. “ఈ రోగం అసలు నయం అవుతుం దంటారా డాక్టర్ నాకు?” శాంతమ్మ హీనస్వరంలో అడిగింది. ఆవిడ అడిగిం దేమిటో సరిగ్గా విన్పించని సారథి లేచి వెనక్కు తిరిగి ‘యేమిటి?’ అన్నాడు. ఇంతలో జ్యోతి కెవ్వుమంది. ‘అరె! యేమి టది?’ సారథి చివ్వున తిరిగిచూసి ‘ఓ! సారీ. వెరివెరీ సారీ’ అన్నాడు. లేచి తిరగడంలో అతని బూటుకాలు జ్యోతి చేతిమీద పడింది.

“యేదీ చూడనివ్వండి” సారథి చెయ్యి చాచాడు.

“యేంలేదు. ఫర్వాలేదు,” జ్యోతి చేతిని వెనక్కు దాచుకోబోయింది. ఈ లోపలే సారథి ఆ చేతిని అందుకుని తన రెండు చేతుల్తోనూ పట్టి పరీక్ష చేసాడు. చూపుడు వ్రేలు, దాని ప్రక్కవ్రేలు కమిలిపోయి వున్నాయి.

“అబ్బ! చాలా బాధనిపించి వుండాలి. అవును మరి. కాస్తాకూస్తా బరువా! నూట యాభై పౌనులయ్యే” అంటూ నవ్వి, “యిలా కాలు తొక్కితే వెంటనే తక్కిన వ్రేళ్ళు నోట్లో పెట్టేసుకుంటే సగం బాధ పోతుందంటారు” అంటూ జ్యోతిని వారించే లోపలే చేతివ్రేళ్ళని తన నోట్లో పెట్టేసుకున్నాడు. క్షణంసేపు జ్యోతికళ్ళు సారథి కళ్ళతో కలిసినాయి. ఆ క్షణంలో సగంసేపు జ్యోతికళ్ళలో కదిలిన మెరుపులాటి భావాన్ని చూసి సారథి చకితుడైనాడు; ముగ్ధుడైనాడుకూడా. కిటికీ దగ్గరగావున్న చిన్నస్టూలుమీద కూర్చుని బొమ్మలపుస్తకం తిరగేస్తూ యిదంతా చూస్తున్న గీత మొహం యీర్ష్యతో కుంచించుకుపోవడం యిద్దరూ గమనించలేదు.

సారథికి అక్కడినుంచి వచ్చేసింతర్వాత చాలాసేపు, చివరికి పడుకోబోయేటప్పుడు, మంచంమీద పడుకుని కళ్ళు మూసుకున్నప్పుడు గూడా జ్యోతి కోల మొహం, సోగకళ్ళు, ఆ కళ్ళలో క్షణంసేపు మెదిలిన ఆ మెరుపులాటి భావం, పై పెదవిమీద కొట్టొచ్చినట్టు కన్పిస్తున్న పుట్టుమచ్చా స్పష్టంగా గుర్తుకు రాసాగాయి. యిన్నాళ్ళ పరిచయంలో గీత మొహం యెప్పుడూ యే సమయంలోనూ తనని యిలా వెంటాడలేదు.

అలా పడుకుని సరిగ్గా గుర్తు చేసుకుంటున్న సమయానికే, యిక్కడ విశాల, యింటికి వస్తూనే కూతురు చెప్పిందంతా విని మండిపడ్తూ జ్యోతిని తన గదిలోకి పిలిచి 'జ్యోతీ, దిక్కులేనివాళ్ళని జాలిపడి దగ్గరకు తీశాను. చివరికి నువ్వు గీత మనసులోనే చిచ్చుపెట్టటానికి తయారవుతుంటే ఒక్కనిముషంగూడా నాయింట్లో వుండొద్దు. తక్షణం నా యింట్లోంచి వెళ్ళిపొండి. పాముకి పాలు పోస్తే ఎగిరి కాటేసిందిట. నీ పద్ధతి అలాగే వుంది" అంది.

"పిన్నీ. నే నేంచేసాను!" తెల్లబోతూ అడిగింది జ్యోతి.

"ఇంకా సిగ్గు లేకుండా యేంచేసా నని అడుగుతున్నావా! గీత నా కేం చెప్పలేదనుకున్నావా?"


"గ్లాసు పొరపాటున పగిలిపోయింది పిన్నీ:" జ్యోతి తలవంచుకుని అంది.

"వెధవగ్లాసు పోతే పోయింది. కాని మనసులు విరిగితే అతకటం కష్టం. రేపటి నుంచీ మీ అమ్మకి యింకో డాక్టర్‌చేత వైద్యం చేయిస్తాను. విన్పించిందా?" అంది. జ్యోతి సరేనని వెళ్ళబోతుండగా వెనకనుంచి పిలిచి "ఇదుగో యిదిగూడా జ్ఞాపకంపెట్టుకో. ఒకవేళ సారథి నిన్ను యెందుకు మానేసారని అడిగితే మీ వైద్యం నాకు నచ్చలేదని చెప్పు. ఇంకోరకంగా చెప్పావంటే నాకు తెలియకుండా వుండదు. అలా తెలిసిన మరుక్షణం నిన్ను యింట్లోంచి వెళ్ళగొడ్తాను. అంత వయసు వచ్చింది. ఓచెంప మీ అమ్మ మంచంలోపడి యేడుస్తోంది. నీ కామాత్రం బుద్ధిలేదూ! వెళ్ళు," అంది.

జ్యోతి గదిలోంచి యివతలకు వచ్చింది. ఆపూట భోజనం చెయ్యలేదనే ధ్యాసగూడా మర్చిపోయింది. సరాసరి ఔట్‌హవుస్‌కి వచ్చేసింది.

"భోజనం చేసావుటే!" యింకా మేలుకుని కూతురిరాకకోసం యెదురుచూస్తున్న శాంతమ్మ అడిగింది.

"చేశానమ్మా!"



"నూట ఎనిమిది ప్రదక్షిణాల మొక్కుబడి చెల్లించాలట."

కూతురు అబద్ధం ఆడిందని మాతృహృదయం పసిగట్టేసింది.

"యేదీ, యిక్కడకు రా! అట్లా వున్నావేం?" దగ్గిరకి పిలిచి కడుపుపట్టిచూసి 'ఛీ! అబద్ధం ఆడ్తున్నావు. తిండి తినలేదు కదూ!' అంది. జ్యోతి మంచంమీద కూలబడి గబుక్కున తల్లి గుండెల్లో తల దాచుకుని వెక్కి వెక్కి యేడవసాగింది.

"ఏమయిందే! యేమయిందీ! ఎవరన్నా ఏమైనా అన్నారా?" శాంతమ్మ ఆదుర్దాగా అడిగింది.

"లేదమ్మా! యెవరూ యే వనలేదు. నా కెందుకో వూరికే యేడు పొచ్చింది." వెక్కిళ్ళమధ్య అస్పష్టంగా అంది. జ్యోతి యేడుపుకి శాంతమ్మ మనసు మరోవిధంగా అర్థం చేసుకుంది. ఇదివరకంటే పల్లెటూరు గాబట్టి జీవితాన్నిగురించి జ్యోతి కేమీ తెలియదు. ఇప్పుడు యింట్లో అనుక్షణం గీతని చూస్తుంటే, ముఖ్యంగా సారథి కాబోయే భర్తని తెలిస్తే, జ్యోతి పరిస్థితుల్లో వున్న యే పిల్ల అయినా తన స్థితికి తను కుమిలిపోకమానదు. జ్యోతినీ గీతనీ ప్రక్క ప్రక్క నిలబెట్టి చూసిన శాంతమ్మ కడుపు కూతురిపట్ల జాలితో తరుక్కుపోసాగింది. భగవాన్! నే నేం పాపం చేసాను. నా కెందు కీశిక్ష అనుకోటం మొదలుపెట్టింది.

మర్నాడు సారథి రోజూకంటే ముందుగానే శాంతమ్మకి ఇంజక్షన్ యివ్వటానికి వచ్చాడు. ఈరోజు వెంట కొన్నిటానిక్కులూ మందులూ తనే స్వయంగా కొని తీసుకొచ్చాడు. లోపల్లోపల అతని కీరోజు లేచినప్పటినుంచీ జ్యోతిని మళ్ళీ ఒకసారి చూడాలనే కాంక్ష క్షణక్షణానికీ గీతవాల్లింటికి లాగసాగింది. అతను వచ్చేసరికి ముందు హాల్లో విశాలే యెదురైంది. గీత కాలేజి కెళ్ళింది. జ్యోతి పని ముగించుకుని తల్లి దగ్గరుంది.

"డాక్టరుగారూ! నే నెప్పుడూ సూటిగా మాట్లాడ్తాను. డొంకతిరుగుడుగా మాట్లాడటం నాకు చాతగాదు. మీ రింక శాంతమ్మకి వైద్యం మానెయ్యటం మంచిదని నా సలహా." అంది అతి ప్రశాంతంగా మొహం పెట్టి మాటల్లో మంచితనం నింపి.

"అంటే!" సారథి తెల్లబోతూ అడిగాడు.

"నిన్న యేదో జరిగిందిట — నే నింట్లో లేనుగా! నాకూ తెలియదు. సాయంత్రం రాగానే ఆ పిల్ల యేం చెప్పిందో యేమో

శాంతమ్మ నన్ను పిలిచి మిమ్మల్నిగురించి ఛడామడా మాట్లాడింది. మీరు నాకు కాబోయే అల్లు డని జాగ్రత్తగా మాట్లాడమని చెప్తే నోరు మూసుకుంది."

"ఏమన్నారూ?" అన్నాడు సారథి నీళ్లు కారిపోతూ.

"ఆమాట లన్నీ యెందుకులెండి. అయినా మా గీత అక్కడికీ గొంతు చించుకుని 'ఆయన వుద్దేశ్యం వేరేమీలేదు. కాలు తొక్కి వూరికే ఆ బాధ మరిపించటానికి నోట్లో పెట్టుకున్నారు చెయ్యి' అనిచెప్తే తల్లీకూతుల్లిద్దరూ వింటేనా? ఛీ; మధ్య నాకు సిగ్గుతో ప్రాణం పోయింది" అంది తాపీగా.

సారథి మొహం యెర్రబడింది 'ఛీ–ఛీ' అన్నాడు.

"అయినా అసలు ఆవిడ వొట్టి అనుమానం మనిషి లెండి. దానికితోడు యీ పిల్లగూడా – అయినా అవన్నీ మన కెందుకు. మనకి వంట చేస్తుంది, అంతవరకే. ఆపైన అనవసరం. అసలు మీకు ఆవిడని చూపించడం నాదే బుద్ధితక్కువ అనుకోండి."

తర్వాత తెలివిగా ప్రసంగం మార్చేసింది. సారథి యెక్కువసేపు కూర్చోలేదు. యెంత వుల్లాసంగా వచ్చాడో అంత బరువుగా వెళ్ళిపోయాడు.

"ఆయ నెందుకు రావటంలేదే – చూడటానికి?" నాలుగురోజులు పోయినా డాక్టర్ వచ్చి యింజెక్షన్ యివ్వకపోవటంతో శాంతమ్మ కూతుర్ని అడిగింది. "ఆయనకి చాలా పనుండిటమ్మా" అంది జ్యోతి; జరిగింది చెప్పి తల్లిని బాధ పెట్టటం యిష్టంలేక. ఆ సాయంత్రం భోజనం చేస్తుండగా పిన తల్లిని మరో డాక్టర్ విషయం యెత్తి అడిగింది! చూస్తానే అమ్మా! చూస్తాను. యిదుగో యీ క్లబ్ వార్షికోత్సవం అయిపోతే యిహ కావలసినంత తీరుబడి. ఆ మందు లింకా వున్నాయిగా. ముందు అది వాడు," అంది విశాల. జ్యోతితో యెక్కువగా తగాదా పెట్టుకోవటం ఆవిడకి యిష్టం లేదు. జ్యోతి వచ్చి నప్పటి నుంచీ యింట్లో హాయిగా నిశ్చింతగా వుంది.

*    *    *

పది పదిహేను రోజులు గడిచినాయి. క్లబ్ వార్షికోత్సవం దగ్గర కొచ్చింది. గీతకీ, విశాలకీ భోజనం చెయ్యటానికి కూడా తీరుబడి లేదు. ఈ మధ్య ఒకటి రెండుసార్లు సారథి వచ్చాడు. కాని అతను జ్యోతివైపు చూసే ప్రయత్నంగూడా చెయ్యలేదు. విశాల తప్పకుండా యేదో ఒకటి అతనికి చెప్ప మంటుంది అనుకుంది జ్యోతి. కాని ఆ చెప్పింది యేమిటో యెలాటిదో. తెలియడం లేదు. సారథి అసలు జ్యోతివైపే చూసింది – యిక అతన్ని అడిగేది మటుకు యెలా! ఆ రోజే వార్షికోత్సవం. మూడు గంటలకల్లా గీతా, విశాలా తయారై టిఫిన్లు తిని కాఫీ తాగి వెళ్ళిపోతున్నారు. నిలువుటద్దం ముందు కూర్చుని సిగలో పూలు సరిగ్గా అమిరాయో లేదో అని చూసుకొంటున్న విశాలదగ్గరకి జ్యోతి వచ్చి పిన్నీ, అమ్మ కీ రోజు బొత్తిగా బాగా లేదు. వుదయంనుంచీ యేం తినలేదు. అసలు పిలిస్తే మాట్లాడటం కూడా లేదు" అంది, కళ్ళల్లో నీళ్ళు దాచుకోటానికి ప్రయత్నిస్తూ.

"యేం చెయ్యమంటా వయితే? క్లబ్బు కెళ్ళటం మానేసి మీ అమ్మదగ్గర వచ్చి కూర్చోమంటావా! మధ్య నే నేంచెయ్యాలి. దిగులుపడొద్దని డాక్టర్ చెప్తాడు. ఈవిడేమో అస్తమానమూ నీపెళ్ళిని గురించి తలపోస్తూ కుమిలిపోతూ వుంటుంది. ఏం ఫర్వాలేదులే; రేపు చూస్తా నొచ్చి. యిలారా! వెనక యీ పూలు సరిచెయ్యి. సరిగ్గా రావటం లేదు" అంది - యింకా చిన్న అద్దం వెనకి పెట్టి ముందు అద్దంలోకి మెడ తిప్పి చూసుకుంటూ. జ్యోతి వచ్చి పూలు సరిచేసింది.

మరో అరగంటలో తల్లీ కూతుళ్ళిద్దరూ వెళ్ళిపోయారు. సాయంత్రం అయింది. రాత్రికి చెయ్యవలసిన వంటపని ముగించుకుని జ్యోతి వచ్చి తల్లిదగ్గిర కూర్చుంది. చీకటి పడింది. లైట్లు వెలిగాయి. క్లబ్బులో యీపాటికి వాళ్ళంతా జోరుగా వుండవచ్చు. ఈ వూరు వచ్చి యిన్నాళ్ళయినా జ్యోతి ఆ యింటి ఆవరణ దాటి బైట అడుగు పెట్ట లేదు. వున్నట్టుండి తల్లి పిలుస్తున్నట్టు విన్పించిన జ్యోతి గబగబా తల్లిదగ్గరకి వెళ్ళింది. ఆవిడ మొహం పాలిపోయి వుంది. ఇక్కడికి వచ్చింతర్వాత వున్న జుట్టు, మిగిలిందిగూడా, నెరిసిపోయింది.

'యేమిటమ్మా? యేం కావాలి' అంది జ్యోతి అప్యాయంగా. తల్లికోసం త నెన్ని కష్టాలయినా యెదుర్కోవాలి అనుకుంటూ.

'డాక్టర్, డాక్టర్' అస్పష్టంగా అంది శాంతమ్మ. ఆవిడ కేదో అనుమానం లాటిది తగిలింది.

'డాక్టరా!' దిగులుగా అంది జ్యోతి.

'పిన్ని?'

"పిన్ని లేదమ్మా - పనుండి వెళ్ళింది, యిప్పుడు రాదు. శాంతమ్మ మొహంలో అస్పష్టమైన భావం ఒకటి కనుబొమలు ముడిచేలా చేసింది. వున్నట్టుండి ఆవిడకి వెక్కిళ్ళురావటం ప్రారంభించాయి.

"అమ్మా, మంచినీళ్ళు తాగుతావా, తీసుకు రానా? అమ్మా! మాట్లాడమ్మా! నాకు భయం వేస్తోంది" తల్లిని భుజాలు పట్టి గట్టిగా కుదిపింది జ్యోతి.

"డాక్టర్ని పిలవ్వే జ్యోతీ. నా ప్రాణం పోతోంది" శాంతమ్మ హీనస్వరంతో అంది.

జ్యోతి క్షణంసేపు తల్లివైపు చూసింది. ఆవిడ పరిస్థితి అధ్వాన్నంగా వుంది. మరు క్షణం యింట్లోకి పరుగెత్తింది. అక్కడ యెవరూ లేరు. ఇప్పట్లో రారుకూడా. ఏం చెయ్యటం! ఏం పాలుపోకుండా హాలంతా పిచ్చిదానిలా కలియతిరుగుతున్న జ్యోతి చూపులు హఠాత్తుగా అక్కడే టేబిల్ మీదున్న ఫోన్‌మీద నిలిచిపోయినాయి. సారథికి ఫోన్ చేస్తే! జ్యోతి హైదరాబాద్ వచ్చింతర్వాత మొట్టమొదట్లో తల్లిమాటల్తో విషపూరితం గాని గీత జ్యోతికి చనువుగా మాట్లాడ్తూసరదాగాఫోన్‌చెయ్యటం, రేడియో పెట్టటం యిలాటివి నేర్పింది. అప్పుడే గీత

స్నేహితుల్తోపాటు సారథి నంబరుగూడా చూపించింది. జ్యోతి క్షణం ఆలస్యం చెయ్యకుండా నంబరు వెతికేసి డయల్ చేసింది.

"హల్లో, సారథీ స్పీకింగ్' సారథి అప్పుడే హాస్పిటల్‌నుంచి వచ్చి క్లబ్ కెళ్ళి గీత డాన్సు చూడాలని బట్ట లేసుకుంటున్నాడు. యెప్పుడూ కాని సమయాల్లో అర్జంటుగా మోగుతాయి యీ ఫోన్ కాల్స్.

'హల్లో' సారథి విసుగ్గా అవతలనుంచి రెట్టించాడు.

'నేను, నేను.' జ్యోతి తడబడింది. ఏకంగా సారథే. స్వయంగా తీసుకోవటంతో యేం మాట్లాడాలో తోచలేదు.

"ఎవరు, యేం కావాలి." ఆడవాళ్ళ గొంతు విన్పించడంతో కొద్దిగా తగ్గి అడిగాడు సారథి.

'నేను_జ్యోతిని మాట్లాడుతున్నాను.'

'జ్యోతి అంటే_' సారథికి జ్యోతి పేరు తెలియదు.

'నేను. విశాలమ్మగారి_అక్క కూతుర్ని_' జ్యోతిని - వంటమనిషిగా పరిచయం చేయబడ్డాను అనే సంగతి మర్చిపోయింది. మళ్ళీ హఠాత్తుగా గుర్తొచ్చింది. 'నేను వాళ్ళింటో వంట చేస్తాను.'

ఈసారి సారథికి నోట మాటరాలేదు.

'మా అమ్మకి బొత్తిగా బాగాలేదండీ! మీరు దయవుంచి ఒక్కసారి వస్తారా? రాగలరా_' జ్యోతి కంఠం బలవంతాన యేడుపు దిగమింగుతున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది.

"ఇంట్లో యెవరూ లేరా?" వెళ్ళటమా మానటమా అని ఆలోచిస్తూ అడిగాడు.

"లేరు; పిన్నీ - గీతా క్లబ్‌కి వెళ్ళారు. యిప్పట్లోరారు. బాబాయికూడా రారు. మీరు మరోలా అనుకోపోతే" - జ్యోతి కంఠంలో యీసారి యేడుపు మాటల్ని ఆపేసింది.

"వస్తాను యిప్పుడే వస్తున్నాను." సారథి ఫోన్ పెట్టేసాడు. వాళ్ళెవరూ యింట్లో లేనప్పుడు ఆ అమ్మాయి ఫోన్ చేసింది. ఆవిడకు యెక్కువగా వుందని



"ఏమండీ, మీ హోటల్లో భోజనం బావుంటుందా?"
"దివ్యంగా వుంటుంది, వేరే చెప్పాలా. మీ ఇంట్లో భోంచేసినట్టుంటుంది."
"అయ్యబాబోయ్, అయితే వేరే హోటల్‌కి పోతా."

నిజం అని నమ్మటానికి జ్యోతి యేడుస్తున్న కంఠమే సాక్షి. బట్ట లేసుకున్న సారథి క్లబ్బుకెళ్ళటానికి బదులు యిక్కడికి బయలుదేరాడు.

అక్కడ క్లబ్‌లో జ్యోతి గీతావాళ్ళు యెదురు చూస్తూంటా రవి అతనికి తెలుసు.

సారథి యింటికి వచ్చేసరికి తలుపులన్నీ బార్లా తీసివున్నాయి. యెక్కడా శబ్దంలేదు. ఔట్‌హవుస్‌వైపు బైలుదేరాడు. దూరానికి జ్యోతి యేడుపు అమ్మా - అమ్మా అంటూ విన్పిస్తోంది. లోపల అడుగుపెట్టేసరికి అక్కడ మంచాని కివతలగా ప్రసాదరావు గారు కూడా నిలబడి వున్నారు. అతనికి కాస్త నిశ్చింత అన్పించింది. ధైర్యంగూడా వచ్చింది కాని శాంతమ్మని చూస్తుండగానే తెలిసిపోయింది; జ్యోతి వుత్త ప్రాణంలేని శరీరంమీద పడి యేడుస్తోందని. సారథి వచ్చి మెల్లగా శాంతమ్మ చేతిని జ్యోతినుంచి తప్పించేసి గుడ్డ కప్పేశాడు.

'అదేమిటి - ఇంజక్షన్ యివ్వకుండా' కళ్ళు పెద్దవిచేస్తూ అడిగింది జ్యోతి. అడుగుతుండగానే అర్థమైపోయింది 'అమ్మా' అంటూ కప్పలా శాంతమ్మమీద కూలిపోయింది. దూరంగా నిలబడ్డ ప్రసాదరావుగారు దగ్గర కొచ్చి జ్యోతిని దగ్గరకు తీసుకున్నారు. ఆయన కళ్ళలోగూడా నీళ్ళు తిరిగాయి. సారథి డాక్టర్‌గా వుంటున్న తర్వాత యెన్నిరకాల చావులో చూశాడు. యెంత మంది యేడవటమో చూశాడు. కాని ఈరోజు జ్యోతి ఆక్రందన అతని హృదయాన్ని కదిలించినట్టు యెప్పుడూ కదిలించలేదు. అతని కెందుకో హృదయవిదారకంగా పసిపిల్లలా యేడుస్తున్న జ్యోతిని తన చేతుల్లోకి తీసుకుని ఓదార్చా లనిపించింది. కాని బలవంతగా ఆ కోర్కెని ఆపుకున్నాడు. జ్యోతిని గురించి విశాల చెప్పిన మాట లన్నీ అబద్ధం అనే అతనికి గట్టిగా అన్పించింది.

* * *

శాంతమ్మ పోయిగూడా నెలరోజు లవుతోంది. విశాల యెంత చెప్పినా వినకుండా జ్యోతి అవుట్‌హవుస్‌లోనే వుంటోంది. ఇంట్లో వంట యథాప్రకారం చేస్తూనే వుంది. మధ్యలో అప్పుడప్పుడు యేనాడూ యేమీ పల్లెత్తి అనని ప్రసాదరావుగారు మటుకు 'నీకు బుద్ధిలేదూ! ఆ అమ్మాయి అంత బాధలో వుంటే వంట చేయిస్తున్నావు' అని అడగటం ప్రారంభించాడు. 'మీరు వూరు

కొంది. బాధ లందరికీ వస్తాయి. మీ రలా అన్నారంటే అది నెత్తి కెక్కి సవారీ చేస్తుంది.' విశాల భర్తని విదిలించి పారేసింది. విశాలకి ఓవిధంగా శాంతమ్మ పోవడం హాయిగానే వుంది. జ్యోతికి మరీ దిక్కులేదు. చచ్చినట్టు పడివుంటుంది. ఆవిడ కీమధ్య యింకో ఆలోచన గూడా వచ్చింది. తనకు తెలిసినవాళ్ళళ్ళోనే దామోదరం అనే కుర్రాడు వున్నాడు. వాడి కామె అంటే మహా అభిమానం. ఆ దామోదరానికి జ్యోతి నిచ్చి చేస్తే యిద్దరూ యింట్లోనే పడివుంటారు. బైటపను లన్నీ వాడు చేస్తాడు, ఇంట్లో అంతా జ్యోతి చూస్తుంది. వుండటానికి యెలాగూ ఔట్ హవుస్ వుండనే వుంది. ఆవిడ మెల్లగా యీ యత్నం ఫలించడానికి ప్రయత్నం చెయ్యసాగింది. దామోదరం రికామిగా తిరగను కూడా తిరగడంలేదు. యేదో ప్రయివేట్ కంపెనీలో నూరురూపాయిలుతెచ్చుకుంటున్నాడుకూడా.

విశాల మెల్లగా సమయం చూసుకుని దామోదరం పెళ్ళిసంగతి ఎత్తి జ్యోతిని చేసుకోమని కోరింది. మొదట నల్లగా, లావుగా, ఎత్తు పళ్ళతో, మిడిగుడ్లతో వుండే దామోదరానికి విశాల చెప్తున్న దేమిటో అర్థంగాలేదు. తర్వాత జ్యోతిని భార్యగా చేసుకోమంటోం దని తెలియగానే సంతోషంతో అతని మొహం వికసించింది. వికృతంగా వున్న వాళ్ళకి సంతోషం లాటిది గూడా మొహంమీద వికృతంగానే కన్పిస్తుంది.

"తమరి దయ." యికిలిస్తూ, చేతులు నలుపుకుంటూ కృతజ్ఞతాభారంతో భుజాలు వంగిపోగా వినయంగా అన్నాడు.

"ఇద్దరూ హాయిగా పెళ్ళి చేసుకొని చిలకా గోరింకలా మా అవుట్ హవుస్‌లో వుండండి. మరి పెళ్ళాన్ని చూపించిందాన్ని యిల్లు గూడా చూపించాలిగా!" అంది నవ్వుతూ.

"చిత్తం, తమ రెలా అంటే అలా!" దామోదరం కంటికి విశాల కేవలం వరం యిస్తున్న దేవతలా కన్పించింది. లేకపోతే జ్యోతి లాంటి భార్యని యివ్వటమేగాక యిల్లు గూడా యిస్తుందా! ఈ మహా నగరంలో తనలాటి వాడికి చిన్న యిల్లయినా సరే, దొరుకుతుందంటే మహా అదృష్టం గదూ! దామోదరం కంటికి అవుట్ హవుస్‌లో తనూ జ్యోతీ చిలకా గోరింకలా తిరుగుతున్నట్టే కన్పిస్తోంది.

"ఏదో యింత చేసినందుకు మమ్మల్ని మటుకు కనిపెట్టుకు వుండండి. అది చాలు" అంది విశాల తెలివిగా అసలు విషయం బైట పెట్టూ.

"అమ్మమ్మ; ఎంతమాట" దామోదరం శ్రద్ధగా చెంపలు వేసుకున్నాడు.

అప్పుడప్పుడూ యింటికి వస్తూ పోతుండటం వల్ల దామోదరం జ్యోతికి తెలుసు. ఆ రాత్రి విశాల పడుకోబోతుండగా ఖర్చుల పుస్తకం ముందు పెట్టుకుని అది చూడకుండా జ్యోతిని చూస్తూ అక్కగార్ని తలుచుకొని విచార పడ్తూ "ఈ సంగతి అప్పుడే తెలిస్తే మీ అమ్మ యెంత సంతోషించేదో" అంది.

'ఏ సంగతి' అంది జ్యోతి వుదాసీనంగా.

'అదే! దామోదరం సంగతి. అతను నిన్నే చేసుకుంటా డని కల్లో గూడా అనుకోలేదు. కాని వూరికే మాటవరసకి యెత్తితే సరే నన్నాడు. అయినా వయసు వచ్చినదానివి. వంటరిగా వుండటం మంచిది గాదేమో! నీకు మటుకు మేం తప్ప యెవ రున్నారు. యీ వేసవి కాలంలో గీతతోపాటు నీ పెళ్ళి గూడా చేసేస్తాను. నా కింత చేస్తున్నావు. నీకు ఆమాత్రం చెయ్యకపోతే ఎలా? చెయ్యి ఖర్చు అవుతుం దనుకో! అయినా డబ్బు దగ్గిర మొహం చూసుకోవటానికి నువ్వేమైనా పరాయిదానివా యేమన్నానా?"

జ్యోతి చివ్వున లేచినుంచుని 'పిన్నీ, నీకు పుణ్యం వుంటుంది. నన్నిలా నీ వంట మనిషిగానే వుండనీ' అంటూ అక్కడనుంచి లేచి వెళ్ళిపోయింది.

ఆ రాత్రి జ్యోతికి కంటిమీద కునుకే లేదు. పింతల్లి ప్లాను యిప్పు డర్థం అవుతోంది. దిక్కులేనిదానికి బుద్ధిలేనివాడిని కట్టిపెట్టి జీతాలు లేని నౌకర్లుగా యెల్లకాలం చేసుకోవా లనుకుంటోంది కాబోలు. తన కంఠంలో ప్రాణం వుండగా ఈ పెళ్ళికి ఒప్పుకోదు. 'దామోదరం! హుఁ! చిన్న చిన్న పిల్లలు పగలు చూస్తే ఝడుసు కోవాలి. రాత్రిపూట కలతనిద్ర పోయే దామోదరం! పిన్నిచుట్టూ, గీతచుట్టూ చేతులు నలుపు కుంటూ తిరిగే దామోదరం! భగవాన్! నా కిప్పటికి అమ్మని దూరం చేసిన శిక్ష చాలదా? నీకు తృప్తిలేదా?' అని యేడవటం ప్రారంభించింది. ఇదివరకు కాస్త యే దుఃఖం కలిగినా తలదాచుకుని యేడవటానికి తల్లి హృదయం వుండేది. యిప్పు డేపీ లేదు జ్యోతి రాత్రి పొద్దు పోయేవరకు చాలా సేపు యేడుస్తునే వుంది. రాత్రి పేపరు దిద్దుకుని పడుకోపోయే ముందు యింకా ఔట్ హవుస్‌లో లైట్ వెలగటం చూసి ప్రసాదరావుగారు వచ్చి జ్యోతిని పిలిచారు. 'నిద్ర పట్టలేదు బాబాయి' అంది జ్యోతి తలుపు తీస్తూ. 'అలాగైతే వచ్చి నా గదిలో కూర్చో. పుస్తకా లున్నాయి, యిస్తాను.' జ్యోతిని తీసుకొచ్చి గదిలో కూర్చోపెట్టి ఆయన మళ్ళీ పేపర్లు దిద్దుకోవడం ప్రారంభించాడు. జ్యోతికి ఆయనతో దామోదరం విషయం చెప్పా లని యెంత అన్పించినా చెప్పలేకపోయింది. కాని తన కంఠంలో ప్రాణం వుండగా మటుకు అతన్ని చేసుకోదు. అది మటుకు నిజం. నిశ్చయం చేసుకుంది.

* * *

సారథి యెందుకో యీ మధ్య అంతగా యింటికి రావడం లేదు. ఒకవేళ వచ్చినా ఎక్కువ సేపు కూర్చోవటం లేదు.

గీతకి రెండు రోజులనుంచీ జ్వరం వస్తోంది. సారథి వచ్చి యింజెక్షన్ యిచ్చి వెళ్ళాడు. వచ్చినప్పుడు జ్యోతి, విశాల పిలవటంతో నీళ్ళు తీసుకెళ్ళి యిచ్చింది.

"అలా వున్నా రేం మీరు. ఒంట్లో బాగా లేదా !" కిందటిసారి తను చూసినప్పటికీ యిప్పటికీ కొట్టొచ్చినట్టు కన్పిస్తున్న తేడా చూసి ఆశ్చర్యపోతూ అడిగేశాడు సారథి.

విశాల మొహం కుంచించుకుంది.

"చాలా బలహీనంగా కన్పిస్తున్నారు. మిమ్మల్ని చూస్తుంటే జ్వరం గూడా వున్నట్టుంది. యేదీ చూడనివ్వండి." సారథి చెయ్యి జాచాడు.

"ఏం లేదు. బాగానే వున్నాను" ఒకసారి పినతల్లి వైపు చూసి వెళ్ళిపోబోయింది.

"అదేమిటి ? ఆయన చూస్తా నంటే బుద్ధి లేదూ !" విశాల మందలించింది.

సారథి థర్మామీటర్‌తో చూశాడు. 102 జ్వరం వుంది. "చూశారా! నా కప్పుడే అనుమానం తగిలింది. జాగ్రత్త ! వూళ్ళో బాగా జ్వరాలుగా వున్నాయి. యెక్కువ తిరక్కుండా రెస్ట్ తీసుకోండి" అని బాగ్‌లో గోలీలు తీసియిచ్చి వెళ్ళిపోయాడు.

"బాగుంది! వచ్చింది నన్ను చూడటానికి; వైద్యం జరిగింది నీకు-" వెటకారంగా అంది గీత.


"అయినా అదేమిటీ! పొగరు కాకపోతే! అతను పిలుస్తుంటే వెళ్ళిపోతావేం ? అంత అతి బుద్ధిమంతురాలి వనిపించుకోవాలనా?" అంది విశాల.

జ్యోతి తల తిప్పేసుకుని కన్నీళ్లు ఆపుకుంటూ వచ్చేసింది. అడుగడుక్కూ ఎలా మాట్లాడ్తారు వాళ్ళు !

తనంటే యెందు కంత లోకువ! దిక్కులేని దని గాబోలు !

సారథి యిచ్చిన గోలీలతో మర్నాటికి జ్వరం జారిపోయింది. ఒళ్ళు నొప్పులు గూడా తగ్గిపోయినై. అలాగే నీరసంతో ఆ రోజు వంట చేసింది.

గీతా, విశాలా కలిసి బజారు కెళ్ళారు. రెండు రోజుల తర్వాత గీత పుట్టినరోజు. ఆ పుట్టినరోజునాడే అందరికీ సారథి గీతను చేసుకోబోతున్నట్టు తనని దామోదరం చేసుకోబోతున్నట్టు అందరికీ చెప్తుం దిట. ఆ రోజే



"తల నెరిసినాయన్తో కాపురం చైమంటారా ? మీకు మాత్రం తెలీదా ? అనుభవజ్ఞులు !"

లగ్నాలు గూడా నిశ్చయం చేసేస్తారట. దామోదరం మాట గుర్తొస్తేనే జ్యోతి ఒంట్లో రక్తం నీళ్ళుగా మారుతోంది. ఎలాగో సాయంకాలపు వంట పూర్తిచేసివచ్చి, ఔట్ హవుస్‌లో కూలబడింది.

బైట ఆకాశం అంతా మేఘావృతం అయివుంది. వానని యిప్పట్లో రానివ్వను అన్నట్టు గాలి జోరుగా వీస్తూ మేఘాలని చెల్లాచెదురు చెయ్యటానికి ప్రయత్నం చేస్తోంది. ఇలా వంటరిగా ఒక్కనిమిషం నిలబడితే చాలు, తల్లి జ్ఞాపకం పిచ్చిదాన్ని చేస్తుంది. కూర్చున్న జ్యోతి లేచివచ్చి కిటికీదగ్గర నిలబడింది. పల్లెటూళ్ళో యెంత బాగుండేది. దారిద్ర్యంలోగూడా సుఖంగా గడిపిన రోజులవి. తనసలు తల్లిని యిక్కడకు తీసుకురాకుండా వుంటే, ఆవిడ మరికొన్ని రోజులు బ్రతికేదేమో ! తనే ప్రాణాలు తీసి బలవంతంగా తీసుకొచ్చింది. వచ్చింతర్వాత ఒక్కరోజు కూడా ఆవిడ నిశ్చింతగా నిద్రపోలేదు. దీని కంతటికీ కారణం తన మొండి పట్టుదలే నన్న సంగతి గుర్తుకొచ్చి కుమిలిపోసాగింది. అమ్మా ! యెక్కడున్నావమ్మా ! నువ్వు లేని ప్రపంచం నా కెంత శూన్యంగా వుందీ ! పిన్ని నాకు దామోదరంతో పెళ్ళి చేసి నా జీవితం మరింత నరకం చెయ్యటానికి కంకణం కట్టుకుంది. కిటికీ చువ్వలకి తల ఆన్చుకుని చేతుల్లో మొహం దాచుకుని వెక్కివెక్కి యేడుస్తూ తల్లికి మానసికంగా తన ఆవేదనని తెలియబరుచుకోసాగింది. ఇంతలో యెవరో లోపలికి వచ్చిన శబ్దం విన్పించింది. బాబాయి గావచ్చు. బాబాయి తప్ప యిప్పు డెవ రొస్తా రింకా ! ఆయనకి యేడుస్తున్న తన మొహం చూపించడం యిష్టం లేక యింకా అలాగే వుండిపోయి ఉబుకుతున్న కన్నీళ్ళని నిగ్రహించుకోసాగింది. 'జ్యోతి' అస్పష్టంగా అంటూ బలంగా వున్న రెండుచేతులు జ్యోతిని తన వేపు తీసుకుని తలని గుండెలమీద అన్చుకున్నాయి. యేదో చెప్పా లనీ, యేడుపు ఆపుకోవా లనీ చూసిన జ్యోతి ప్రయత్నం వ్యర్థంకాగా మరింత పొర్లుకొచ్చింది. విశాలంగా వున్న ఆ ఛాతీమీద తల అన్చుకుంటే కళ్ళు మూసుకునివున్న జ్యోతికి అచ్చు తల్లిదగ్గరే వున్న ట్టనిపించింది. పింతండ్రికి దామోదరం సంగతి చెప్పా లని నిశ్చయం చేసుకుంటూ "బాబాయి, ఆ దామోదరాన్ని నేను చేసుకోను. అంతకంటె చచ్చిపోవడం హాయి. మీ దగ్గరే యెప్పటికీ వంట చేస్తూ వుండిపోతాను. పెళ్ళి వద్దు నాకు. నువ్వు పిన్నికి చెప్పు." అంది వెక్కిళ్ళమధ్య.

బాబాయి యేం సమాధానం చెప్పలేదు. జ్యోతి కొంచంసేపు ఆగి మళ్ళీ చెప్పటం ప్రారంభించింది "ఇందాక సారథి వచ్చినప్పుడు గూడా అంది. ఆయనంతట

ఆయన అడిగి మందిచ్చి వెళ్ళారని గీతా, పిన్నీ తర్వాత యెన్నిమాట లన్నా రనీ! నేనేదో కావాలని ఆయన్ని ఆకర్షించటానికి ప్రయత్నం చేస్తున్నానని వాళ్ళ అనుమానం. నా కలాంటి దేమీ లేదు.''

జ్యోతి భుజాల చుట్టూ వున్న చేతులు మరింత బిగిసి ఇంకొంచం దగ్గరకు లాక్కున్నాయి.

"దామోదరాన్ని పెళ్ళి చేసుకోనని నువ్వు చెప్పు. చెప్పవూ! జన్మలో యింకో సహాయం అడగను నిన్ను."

ఎంత సేపటికీ ప్రసాదరావు పలకక పోవటం, తనని దగ్గరకు తీసుకోవటంలో కూడా యేదో మార్పు అప్పటికి గమనించిన జ్యోతి తలెత్తుతూ అడగబోయి, ఆగిపోయింది. యేడుపుతో యెర్రబడిన కళ్ళు ఆశ్చర్యంతో పెద్ద వైనాయి.

"మీరా!" అంది గుండెల మీద చేయి వేసుకోబోతూ.

"జ్యోతీ" కళ్ళలోకి పరీక్షగా చూస్తూ అన్నాడు సారథి.

"మీరు – మీరు" జ్యోతికి నోట్లోంచి మాట రాలేదు. అతని చేతులమధ్యనుంచి విడిపించుకోటానికి ప్రయత్నం చేసింది. సారథి క్షణంసేపు వదిలినట్టే వదిలి మళ్ళీ దగ్గరకు లాక్కున్నాడు. ఈ రోజుతో, అప్రయత్నంగా జ్యోతిని యిలా, దగ్గరకు లాక్కోవటంతో ఈ మధ్య తరుచుగా అతనిని వేధిస్తున్న సమస్యకి సమాధానం స్పష్టంగా తెలిసిపోయింది. కళ్ళముందు అంత యింత అణుచుకుని వున్న అనుమానపు తెరలు తెగి క్రింద పడిపోయినాయి.

"ఇంతకు మునుపు నేను ఫలానా అని తెలియకుండా దగ్గరకి వచ్చావు. నే నిప్పుడు ఫలానా అని తెలుసుకుంటూ దగ్గరకి తీసుకుంటున్నాను'' జ్యోతి తలని గుండెలకి అన్చుకుంటూ అన్నాడు.

"మీరు – మీరు" యింకా యెదో చెప్పాలనే ప్రయత్నం చేస్తోంది.

"జ్యోతీ! నా అన్నవాళ్ళు లేని ఒంటరితనం యెంత భయంకర మైనదో నాకు తెలుసు. నేను గూడా కొన్ని సంవత్సరాలు అనుభవించాను. ఉదయం యిక్కడ స్టెతస్కోప్ మర్చిపోయి వెళ్ళాను. అది యింటికి వెడ్తూ తీసుకెళ్ళా లని వచ్చాను. ఇంట్లో యెవరూ లేరు. నీ జ్వరం యెలా వుందో ఒక్కసారి చూసి కనుక్కొని పోదా మని యిటు వచ్చాను. ఇంత పెద్ద యింట్లో ఓమూలగా యీచిన్నగదిలో నువ్వు యేడుస్తూ కన్పించటం చూసి నిజంగా..." సారథి ఆగిపోయాడు.

ఇంతలో బైటనుంచి 'జ్యోతీ! ఓ జ్యోతీ! యిల్లంతా యిలా బార్లా తలుపులు తీసి యెక్కడే నువ్వు.' అంటూ విశాల గొంతు విన్పించింది. వులికిపడ్డ సారథి జ్యోతిని వదిలేయబోయి మరోసారి బాగా దగ్గరగా లాక్కుని నుదురుమీద ముద్దు పెట్టుకుంటూ 'నే నున్నాను నీకు. అది మర్చిపోకు' అని వదిలేసాడు.

ఈ లోపలే విశాల లోపలికి వచ్చింది. గదిలో బాగా చీకటి ఆవరించుకుంది. అయినా లైటు వెయ్యలేదు. చీకట్లో కూర్చుని యేం చేస్తున్నట్టు! వాకిట్లో సారథి కారు చూసిందావిడ. సరిగ్గా ఆవిడ వూహ నిజమైంది. సారథి చీకట్లో ఔట్‌హవుస్‌లో జ్యోతి దగ్గ రున్నాడు.

'నా స్టెతస్కోప్ వుదయం మర్చిపోయాను. దానికోసం వచ్చి జ్యోతి కెలావుందో చూసి పోదాం అని వచ్చాను' అన్నాడు అతను, యేమాత్రం తొణుకు లేకుండా. విశాల లోపలికి వచ్చేసరికే జ్యోతిని వదిలేసి చాలా దూరంలో నిలబడ్డాడు. జ్యోతి భయం భయంగా క్రిందకు చూస్తుండిపోయింది.

"జ్వరం తగ్గిందా మరి."

'ఆఁ ఫర్వాలేదు. ఈ పూట భోజనం చేయ్యొద్దు. నేను చెప్పిన ఆ మందు వేసుకోవటం మర్చిపోకండి. వస్తాను.' సారథి బైట కొచ్చేశాడు. అతని వెనకే వచ్చేస్తున్న విశాల వెనక్కు తిరిగి జ్యోతి వైపు విషపు చూ పొకటి విసిరి వెళ్ళిపోయింది. జరిగిం దానికి సారథి వెళ్ళిపోయిం తర్వాత విశాల యేమీ అనకపోవటం చూసి జ్యోతికి ఆశ్చర్య మనిపించింది. పడుకోబోతుండగా ఆవిడే ఔట్ హవుస్‌కి వచ్చి స్టూలు లాక్కుని కూర్చుని 'మందు వేసుకున్నావా' అని ఆమాటా యీమాటా అడిగి, తీరా వెళ్ళబోయే ముందు దామోదరం చాలా తొందర పడ్తున్నా డనీ, ఒక వారంరోజుల్లో లగ్నం చూసి పెళ్ళి చేసేస్తా ననీ చెప్పి వెళ్ళిపోయింది.


జ్యోతికి రెండు కారణాలవల్ల ఆ రాత్రి నిద్రపట్టలేదు. ఒకటి – సారథి ప్రవర్తనా, అతనిమాటలూ, రెండు–పింతల్లి అతిక్రూరంగా విధించబోతున్న పెళ్ళి అనే రూపంలో యీ శిక్ష. ఎంత సేపు ఆలోచించినా యేం పాలుపోలేదు. పోనీ యీ యింట్లోంచి యెక్కడికైనా వెళ్ళిపోతే! యెక్కడికి? ఎక్కడికి వెడ్తుంది తను! యింట్లోంచి వెళ్ళిపోవాలి అనుకునేది బైట బ్రతకటానికి గాదు, చచ్చిపోవటానికి – చావు యెలా దొరుకుతుందో వెతకటానికి. పల్లెటూళ్లలో లాగా యిక్కడ బావులూ, చెరువులూ లేవు. అవి తప్ప ప్రాణాలు తీసే వస్తువులు యేవీ జ్యోతికి తెలియవు. పోనీ యిక్కడే యే చీరతోనైనా వురి వేసుకుంటే? ఉహుఁ! అది చాలా సేపు పడ్తుంది. క్షణంలో ప్రాణం పోయే మార్గం కావాలి. యెలా–యే విధంగా! బ్రతికుంటే దామోదరంభార్య కాక తప్పదు. పిన్ని చేతుల్లోంచి తప్పించుకోవా లనుకోవడం అంత వెర్రితనం యింకోటి యేదీ లేదు. మృత్యువు తప్ప తనకి మరో మార్గం లేదు. మనసు రాయి చేసుకున్న జ్యోతి మంచంమీదనుంచి లేచి దొడ్డివై పున్న చిన్నగేటు తెరుచుకుని చీకటిగా వున్న సందులో నుంచి నడిచి బైట కొచ్చేసింది. వీథులు దాటుతోంది. మలుపులు తిరుగుతోంది. మనసులో సంఘర్షణ బైలుదేరింది, అర్థరాత్రివేళ నిద్రపోతున్న యీ నగరం యెంత అద్భుతంగా వుంది!

యెలాగైనా బ్రతికే వుపాయం చూడమని మనసు పీడించసాగింది.

'వద్దు. బ్రతికితే నరకం చూడటం తప్ప యింకేం దొరకదు. తనకి భగవంతుడు జీవితాన్ని యిచ్చింది బ్రతకటానికి గాని బలవంతంగా ప్రాణాలు తీసుకోటానికికాదు.' కోపంతో అరిచింది మనసు.

'నోర్మూయ్ ! నువ్వు చెప్పే ఆ భగవంతుడే నన్నిలా అర్థరాత్రివేళ చావును వెతుక్కోమని బైటకు పంపించాడు.'

మనసు నోరు మూసుకుంది. కార్ల రద్దీ తగ్గిపోయింది. అప్పుడప్పుడు చెదురుగ ఒకటీ అరా వస్తున్నాయి. ఎదురుగా వస్తున్న లారీ క్రింద పడాలని నిశ్చయించుకుని ఒక్కసారి కళ్ళు మూసుకుంది జ్యోతి. మళ్ళీ కళ్ళు తెరిచేలోపల అది వెళ్ళిపోయింది. ఇంకోసారి దాదాపు కారుక్రిందకు వెళ్ళిపోయా నను కుంది. టాక్సీ అది. టాక్సిడ్రైవర్ తెలివిగా బ్రేకులు వేసి కారు తప్పించి ఆపి, కిటికీలోంచి తల బైట పెట్టి, 'తాగావా' అని తిట్టి వెళ్ళిపోయాడు. దూరంనుంచి యిది గమనించిన ఒక రౌడీ జ్యోతివెంట పడ్డాడు. మొదట తన లోకంలో తనున్న జ్యోతి, వెనక వెనక వస్తున్నవాడిని గమనించ లేదు. 'ప్రియతమా ! ఓ పయనమయే నా ప్రియతమా, వెనుదిరిగి నను చూడుమా !' వాడు పాటలు లంకించు కోటంతో కొద్దిగా



మెడ తిప్పి వెనక్కు తిరిగి చూసింది. వస్తాదులా మెలికలు తిరిగిన శరీరంతో, గళ్ళ లుంగీతో, కోర మీసంతో వాడు జ్యోతిని చూసి గర్వంగా

మీసం దువ్వి చేతులు జాచాడు. వాడిని చూచిన జ్యోతి వేగంగా నడవసాగింది. వాడు గూడా నడక త్వరితం చేశాడు. 'భగవాన్. ఈ సారి రాబోయే కారు నా ప్రాణం తీయకపోతే వీడిచేతుల్లో నా ప్రాణం పోక తప్పదు' అనుకుంది. వాడి నడక జోరైంది. దగ్గిర పడ్తున్నాడు. జ్యోతి సిగ్గు విడిచి పరుగెత్తడం ప్రారంభించింది. వాడుగూడా పరుగు లంకించుకున్నాడు. జ్యోతి వీధి మలుపు తిరిగింది. రెండు అంగల్లో వచ్చి వాడు అందుకునే వాడే. ఇంతలో అటువైపునుంచి కారు వస్తోంది. జ్యోతి అనుకోకుండా భయపడి దారి కడ్డంగా పరుగెత్తబోయి బోర్లాపడిపోయింది. కారు మీద కొచ్చేస్తోంది. 'అమ్మయ్య! చచ్చి పోయాను.' కళ్ళు మూసేసుకుంది. తర్వాత యేం జరిగిందీ యిహ తెలియదు. స్పృహ పోయింది. కారు సడెన్ బ్రేక్‌తో కీచుమంటూ దగ్గరగావచ్చిజ్యోతికివెంట్రుకవాసిదూరంలో ఆగిపోయింది. కారులోంచి తిట్టుకుంటూ దిగినడ్రైవర్ వచ్చి బోర్లాపడిపోయినజ్యోతిని చూసి ఆశ్చర్యపోయి రెండుచేతుల్తోనూ యెత్తి కారులో వేసుకుని తీసుకెళ్ళి పోయాడు.

జ్యోతికి మళ్ళీ మెలకువ వచ్చేసరికి తనెక్కడుందో తెలియలేదు. బ్రతికున్నట్టు మటుకు స్పష్టంగా తెలుస్తోంది. గదంతా యేదో మందులవాసన కొట్తోంది. బహుశా హాస్పిటల్‌లో గావచ్చు. లేదా పిస్నీవాళ్ళ అవుట్‌హవుసేమో! పరీక్షగా చూసిన తర్వాత కాదని తేలింది. మరెక్కడున్నట్టు? జ్యోతి ఆలోచించేలోపలే యెదురుగుండా కన్పిస్తున్న స్ప్రింగ్‌డోర్ తెరుచుకుని సారథి లోపలికి వచ్చాడు. జ్యోతి కళ్ళు వెడల్పయినాయి.

"యెలా వుంది?'' అన్నా డతను.

"మీరా? మీరు-" తను సారథి దగ్గర కెలా వచ్చింది!

"ఈ రోజు క్షణంలో నా చేతుల్లో చావు తప్పింది. ఆవేళలో మీరు యెక్కడినుంచి వస్తున్నారో నేను తెలుసుకోవచ్చా" అన్నా డతను సీరియస్‌గా! అర్ధరాత్రివేళ యేదో అర్జంటుకేసు చూసుకుని యింటికి తిరిగి వస్తున్నప్పుడు యెవరో తెల్లటి బట్టల్లోవున్న వ్యక్తి దూరంనుంచి పరుగెత్తుకు రావటం రోడ్డు క్రాస్ చెయ్యబోయి చీర అడ్డుపడి కారుక్రింద పడిపోవడం అతను చూశాడు. ఆ వ్యక్తి జ్యోతి అని క్రిందకు దిగినప్పుడు తెలిసేవరకు అతని ఆశ్చర్యానికి అంతులేక పోయింది.

''మీ కిష్టం లేకపోతే చెప్పక్కర్లేదులెండి. నే నింతవరకూ మీ యింటికి ఫోన్ చెయ్య లేదు. మీరు యే కారణంమీద బైట కొచ్చే సారో, అలా రావటం యింటో తెలియ పర్చటం అనేది మీ క్షేమానికి మంచిది అవునో కాదో నా కర్థంకాలేదు. అందుకని వూరుకున్నాను."

సాయంత్రం అంత ఆప్యాయంగా మాట్లాడిన సారథేనా యీ సారథి! జ్యోతికి ఆశ్చర్యంతోపాటు యేడుపుగూడా వచ్చింది. సారథి సాన్నిధ్యంలో వున్నాను అనే సంతోషం క్షణంక్రితం కలిగిందల్లా గాలిలో కలిసిపోయింది.

సారథి జ్యోతివైపు వున్న బీరువాలో యేవో మందులు చూస్తూ "యేదయినా, యెవర్నయినా కలుసుకోవాలంటే రాత్రి పూట అంత క్షేమం గాదని మీ కెందుకు తెలియలేదు! ఒకవేళ వెళ్ళినా మళ్ళీ మీరు యింటికి సరిగ్గా చేరారో లేదో చూడటం వాళ్ళ విధి కాదా!" జ్యోతికి అతను చెప్తున్న దేమిటో అర్థంకాలేదు.

"ఇంతకి యిప్పుడు యింటికి ఫోన్ చెయ్యాలా అక్కర్లేదా!" అతని కంఠంలో విసుగు స్పష్టంగా కన్పిస్తోంది.

"వద్దు." యెలాగో అంది జ్యోతి.

సారథి చివ్వున వెనక్కి తిరిగాడు. "యేం? కారణం యేమిటి? మీరుమళ్ళీ యేమీ యెరగనిదానిలా ఆ ఔట్‌హవుస్‌లో పడుకో వచ్చని అనుకుంటున్నారేమో! అది రెండు రోజులవరకూ అసంభవం అని చెప్తున్నాను. పోని వాళ్ళు కాపోతే యింకెవ్వరయినా వుండొచ్చుగా! వాళ్ళకి ఫోన్‌లేకపోతే అడ్రస్ చెప్పండి. నౌకర్ని పంపిస్తాను." సూటిగా జ్యోతి మొహంలోకి చూస్తూ అన్నాడు.

''మీరు అనే దేమిటో నా కర్థంగావటం లేదు.''

"మీరు యింతరాత్రివేళ యెక్కడినుంచి వస్తున్నారో నాకూ అర్థంగావటం లేదు. వూహిద్దామన్నా చాతకావటం లేదు.'' కటువుగా అన్నాడు సారథి.

"భగవాన్! మీరు పొరపడ్తున్నారు." జ్యోతి చెప్పటం ప్రారంభించింది-

"నేను చచ్చిపోవాలని బైట కొచ్చాను. నాకీ ప్రపంచంలో మా అమ్మతప్ప యెవరూ లేరు. అమ్మపోయిన క్షణంనుంచీ నాకీలోకం శూన్యంగానే కన్పిస్తోంది. ఇందాక మీరు వెళ్ళిపోయిన తర్వాత పిన్ని నాదగ్గర కొచ్చి వారంరోజుల్లో దామోదరంకు నన్నిచ్చి పెళ్ళి చెయ్యటానికి నిశ్చయించుకున్నానని చెప్పింది. నాకు నిద్రపట్టలేదు. అతన్ని పెళ్ళి చేసుకునేకంటే చావటం మంచిదనిపించింది. అంతే! లేచి బైట కొచ్చేశాను. యెక్కడ, యేరోడ్డుమీద తిరిగానో నాకు తెలియదు. ఇంతలో ఒక రౌడీ నావెంటపడ్డాడు. అది నేనే వూహించని ప్రమాదం. అతని బారినుంచి యెలా తప్పించుకోవాలో తెలియలేదు. భయం వేసింది. ఇంతలో దూరంగా కారు కన్పించింది. మనసు రాయి చేసుకుని, బ్రతకాలి అనే ఆశ కొనవూపిరితో ఏడు స్తుంటే దాన్ని బలవంతంగా చంపేసి కారు క్రింద పడ్డాను. అది మీ కారని నాకు తెలియదు." మధ్య మధ్య సారథివంకే చూస్తూ, దుప్పటి అంచు మెలిబెడ్తూ అంది. చాలా సేపు మంచందగ్గిరగా పాంట్‌జేబుల్లో చేతులు పెట్టుకుని జ్యోతివైపు చూస్తూ నిలబడిపోయాడు సారథి.

"నన్ను మీరు నమ్మటంలేదులా వుంది. భగవంతుడిసాక్షిగా - మా అమ్మమీద ఒట్టు వేసుకుని మరీ చెబ్తున్నాను. నేను యిల్లు వదిలి బైటకు రావటంలో చచ్చిపోదాం అనే వుద్దేశ్యం తప్ప యింకోటి లేనేలేదు" అంది పసిపిల్లలా.

సారథి హఠాత్తుగా పాంట్ జేబులోంచి చెయి తీసి జ్యోతివైపు జాస్తూ "నమ్ముతాను జ్యోతీ! నువ్వు చెప్పిన ప్రతి అక్షరం నమ్ముతాను" అన్నాడు. సారథి జాచిన చెయి అందుకోకుండానే, "సాయంత్రం మీరు 'నేను నీకున్నాను' అన్నారు. అది గూడా అంతగా పట్టించుకోలేదు. కేవలం మృత్యువునే కోరుకున్నాను. చచ్చిపోవటానికి బైట కొచ్చిన నన్ను మీరు బ్రతికించారు. కాని ఎలా బ్రతకాలో నాకు తెలియటం లేదు. ఈ ప్రపంచంలో నా కెవరూ లేరు. ఒకసారి వదిలేసి వచ్చింతరువాత మళ్లీ పిన్నింట్లో అడుగుపెట్టలేను;" బాధగా అంది.

సారథి మెల్లగా వచ్చి మంచంమీద కూర్చుని జ్యోతి చేతిని తన చేతుల్లోకి తీసుకుంటూ "బలవంతంగా నేను బ్రతికించాను. కాబట్టి బ్రతికే మార్గంకూడా నేనే చూపిస్తాను. నువ్వు భయపడకు" అన్నాడు. అతని కెందుకో యిప్పుడు చాలా రిలీఫ్‌గా వుంది.

"అంటే? యెలా?" సారథి వైపు కన్నార్పకుండా చూస్తూ అంది. క్షణంక్రితం అతనిలో కన్పించిన విసుగూ, కఠినత్వం యిప్పుడు ఛాయామాత్రంగా గూడా లేవు.

"రెండు అవకాశాలు నీకు యిస్తున్నాను. అందులో మొదటిది – నువ్వు అంగీకరిస్తే, నేను నీకు నచ్చితే, నీ గాయాలు కాస్త మానగానే వెంటనే వెళ్ళి రిజిస్టార్ ఆఫీసులో మనం పెళ్ళి చేసుకోవటం. అది నీ కిష్టం లేకపోతే రెండోది–నిన్ను నర్సింగ్‌కోర్సుకి పంపిస్తాను. నువ్వు ఆ ట్రయినింగ్ పూర్తి చేసుకు వచ్చి నా దగ్గర యావజ్జీవితం, ఫర్వాలేదు అనే నమ్మకం కుదిరే వరకూ, నర్సుగా వుండిపోవాలి. రెండోదానికి నీ యిష్టంలేదు. మొదటిది కాదంటే అది ఒప్పుకున్నట్టేలెక్క."

జ్యోతి మొహంలోకి వెచ్చటి ఆవిరి వచ్చింది. సారథి కళ్ళల్లోకి, తన చెవుల్ని తనే నమ్మలేనట్టు చూసింది.

''యేం? మీ పిన్నిని తప్పించుకుని బైట పడ్డే మరో చెర యెదురైంది అనుకుంటున్నావా?'' అన్నాడు నవ్వుతూ.

''లేదు. లేదు.'' జ్యోతికి తను వింటున్నది కలో నిజమో యింకా అర్థం గావటం లేదు.

''ఒప్పుకున్నట్టేనా!'' అని చేతి వాచీ చూసుకుంటూ ''యిప్పుడు పావుతక్కువ రెండు అయింది. తెల్లవారి ఆరు గంటలకి నేను మళ్లీ వచ్చినప్పుడు నీ అభిప్రాయం చెప్పాలి. అంతవరకూ ఆలోచించుకునే గడు విస్తున్నాను," అంటూ లేచి "యిక నే వెడ్తాను. వుదయం కాగానే విశాలమ్మ గారికి ఫోన్ చేస్తాను" అన్నాడు.

''యేమని?''

"నువ్వు నా దగ్గరకి వచ్చేశావని. నేను నిన్ను శాశ్వతంగా వుండిపోవాలని కోరుకుంటున్నానని."

''మరి గీత?''

సారథి క్షణంసేపు ఆగిపోయి జ్యోతి వైపు చూశాడు.

"గీత సంగతి మనం వదిలేద్దాం. తల్లీ కూతుళ్లిద్దరూ తల్చుకుంటే వాళ్ళకి నాకు మించిన వరుడే దొరుకుతాడు. అయినా నేను యెప్పుడూ గీతని చేసుకుంటానని వాళ్ళతో మాటవరసకికూడా అనలేదు. వాళ్ళకి మొదటినుంచీ నామీదకంటె నా డబ్బుమీద యెక్కువ ఆపేక్ష అని నాకు తెలుసు. మైగాడ్! ఖర్మంచాలక యెప్పుడైనా నా డబ్బు పోతే గీత నన్ను గడ్డిపోచక్రిందకూడా చూడదు. అది నాకు తెలుసు."

"మరి రేపు గీత పుట్టినరోజున పెళ్ళికి లగ్నంగూడా పెట్టుకోవాలనుకుంటున్నారు" అంది జ్యోతి.

"నన్నడక్కుండానే! వాళ్ళెంతటికికూడా సమర్థులే: ఆవిడ వుద్దేశ్యం కనిపెట్టి నే నా యింటికి రాకపోకలుగూడా తగ్గించేశాను. సరే. అవన్నీ పోనీ, నువ్వు హాయిగా నిద్రపో!" సారథి వంగి దుప్పటి సరిచేస్తూ అన్నాడు.

కంఠంవరకూ దుప్పటి కప్పి సరిచేస్తున్న అతని చెయ్యివి గట్టిగా పట్టుకుంటూ ''యిప్పుడు నేను విన్నదంతా నిజమేనా, నేను బ్రతకవచ్చుగదూ!" అంది.

''ఆహా! వూరికే బ్రతకటంగాదు. నిశ్చింతగా! ఈ క్షణంనుంచీ నువ్వు నా కంట్రోల్లో వుంటావు. నేను చెప్పినట్టు వినాలి. అలాగని నీ మనసు తెలియకుండా ఆజ్ఞాపించను. నీ బాధ్యత తీసుకునేముందు ను వ్వేమాటయినా సరే నా మొహంమీద చెప్పే అవకాశంగూడా నీ కెప్పుడూ వుంటుందని చెబ్తున్నాను'' అన్నాడు.

జ్యోతి కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. సారథి చేతిని మరింత దగ్గరగా తీసుకుని దాన్ని పెనవేసుకుంటూ ''ఆదరణతో కూడిన అధికారం నా కిష్టం. దాన్ని నేను ప్రేమిస్తాను" అంది.

సారథి సమాధానంగా జ్యోతి చేతిని తీసుకుని ముద్దుపెట్టుకున్నాడు.

"నా బాధ్యత మీ కెప్పుడూ విసుగనిపించకుండా ప్రవర్తిస్తానని నేనుగూడా వాగ్దానం చేస్తాను" అంది.

"నువ్వు నాకే వాగ్దానాలూ చెయ్యక్కర్లేదు. నా మాట వింటే చాలు. మొదటి మాట చెప్తున్నాను. యిప్పటికి నిద్రపో" అన్నాడు నవ్వుతూ.

''అలాగే! కాని మీరు వెళ్ళిపోతే యిదంతా అబద్ధం అయిపోతుందేమో నని భయం వేస్తోంది."

"యేం కాదు. కాదని చెప్తున్నాను. ప్రమాణం చేస్తున్నాను." జ్యోతి తలమీద చేయిపెడ్తూ అన్నాడు.

"సరే! నిద్రపోటానికి ప్రయత్నం చేస్తాను." జ్యోతి బుద్ధిమంతురాలిలా కళ్ళు మూసుకుంది. దుప్పటి సరిచేస్తున్న సారథి చటుక్కున వంగి జ్యోతి కళ్ళమీదా నుదుటిమీదా ముద్దుపెట్టుకుంటూ "ఈ రోజు భగవంతుడు అయాచితంగా నాకు ప్రసాదించిన బహుమతివి నువ్వు. నిన్ను జాగ్రత్తగా చూచుకొనటం, భద్రంగా కాపాడుకోవటం నా విధి" అన్నాడు. జ్యోతి పెదవులమీద తృప్తితో నిండిన చిరునవ్వు మెరిసింది.